


ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

గడువు ఇలా..

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌లకు సంబంధించిన పనులు ఆరు మాసాల్లోగా పూర్తి చేయాలి.
- ఏఐఎస్ కార్యదర్శులకు సంబంధించి 90 బంగ్లాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు 25 బంగ్లాలు, మంత్రులకు 35, హైకోర్టు జడ్జిలకు 36 బంగ్లాలను నిర్మిస్తున్నారు. ఈ పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేసి అప్పగించాలి.



పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

టెండర్లు పూర్తి.. మొదలైన పనులు

- పెండింగ్ పనులకు రూ.1112.74 కోట్లు
- రాజధానిలో రంగంలోకి దిగిన కాంట్రాక్టు సంస్థలు
- 4043 ప్రభుత్వ నివాసాల పూర్తికి గడువు నిర్దేశం

వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని పాడుపెట్టగా కూటమి ప్రభుత్వం తిరిగి గతంలో నిలిచిపోయిన పనులను పట్టాలెక్కిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ భవనాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. గతంలో చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకుని వైసీపీ హయాంలో పాడుబడిన భవనాలను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిశీలించి వాటిపై దృష్టి సారించాలని సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా పనులను పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ ఇటీవల టెండర్లు నిర్వహించింది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థలు రాయపూడికి చేరువగా ఈ-3, ఈ-4 రోడ్ల మధ్య 59.46 ఎకరాల్లో ఏఐఎస్, పిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, న్యాయమూర్తులకు చెందిన నివాస భవన నిర్మాణాలను చేపట్టాయి. 2019 నుంచి పాడుపడిన భవనాల సముదాయంలో పెద్ద ఎత్తున కమ్మేసిన ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేశాయి. అసంపూర్తి భవనాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఏమేమి పనులు చేపట్టాలన్న దానిపై ఆయా కాంట్రాక్టు సంస్థల ఇంజనీర్లు కసరత్తులు చేస్తున్నారు. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఏడాది గడువు విధించింది. దీంతో ఆయా పనులు శర వేగంగా చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రభుత్వ సెక్టారులో తొలివిడతగా 4043 నివాసాల పూర్తికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో వీటి నిర్మాణ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. ఇవన్నీ గత 2019 నాటికి మొదలు పెట్టి చాలా వరకు పూర్తయినవే. అయితే వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అంటూ అవన్నీ గత ఐదేళ్లుగా పాడుపడి ఉన్నాయి. ఇపుడీ భవన సముదాయాలన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఆలిండియా సర్వీసెస్ కార్యదర్శుల బంగ్లాలు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్లు ప్రధానంగా ఉన్నాయి. ఈ భవన

(మిగతా 6వ పేజీలో)

నిధులు ఇలా..

ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్లు కేటాయించారు. వీటికి సంబంధించి తాజాగా టెండర్లను పిలవగా కేఎంవీ సంస్థ దక్కించుకుంది. ఏఐఎస్ బంగ్లా ఒక్కోటి నాలుగు వేల చ.అడుగుల విస్తీర్ణంలో, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలు ఐదు వేల చదరపు అడుగుల్లో ఏర్పాటవుతున్నాయి. మంత్రులు, న్యాయమూర్తుల కోసం 26.09 ఎకరాల్లో 71 బంగ్లాల నిర్మాణ పనులను బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ రూ.401.37 కోట్లతో చేపట్టింది. ఇవి ఆరు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+1 విల్లాల రూపంలోనే ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం రాయపూడి ప్రాంతంలోనే సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి పన్నెండేసి అంతస్తులతో కూడిన 18 టవర్ల(432 ఫ్లాట్లు)ను గతంలో రూ.450 కోట్లతో నిర్మించారు. ఇవన్నీ దాదాపు సివిల్ వర్కులను పూర్తి చేసుకున్నాయి. వీటిలో ఇంటీరియర్ వర్కులు, ఇతర మౌలికవసతులను కల్పించాల్సి ఉంది. ఆయా పనులకు రూ.300 కోట్లను కేటాయించి ప్రభుత్వం టెండర్ నిర్వహించగా ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది.



భవన సముదాయాల మధ్య ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

గుంటూరులో.. చిల్లీ కాంక్లేవ్



- సెప్టెంబరులో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తాం
- ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళిక
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రికి కలెక్టర్ నాగలక్ష్మి విజ్ఞప్తి
- 11.21 శాతం వృద్ధిరేటుతో రాష్ట్రంలో 20వ స్థానంలో గుంటూరు

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు సెప్టెంబరులో చిల్లీ కాంక్లేవ్ పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించబోతున్నామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లలో 40 లక్షల మిర్చి బస్తాలు నిల్వలున్నాయని వాటికి మార్కెటింగ్ కల్పించేందుకు చిల్లీ కాంక్లేవ్ ఉపయోగపడుతుందని నివేదించారు. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మూడో కలెక్టర్ల సదస్సులో రెండో రోజైన బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను కార్యాచరణ ప్రణాళికను, జిల్లాకు సంబంధించిన నిర్దిష్ట సమస్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా వృద్ధి లక్ష్యం 15 శాతంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మొత్తం 19 ప్రముఖ రంగాలలో వృద్ధి రేటు పెరుగుదలకు నిర్దేశిత లక్ష్యాలు, వాటిని అధిగమించేందుకు నిర్దేశించుకున్న సమయాలను తెలుపుతూ కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ వివరించారు. 9 నెలల్లో జిల్లాల వారీగా వృద్ధి రేటు విషయంలో గుంటూరు వెనకబడి ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. 11.21 శాతం వృద్ధిరేటుతో రాష్ట్రంలో 20వ స్థానంలో ఉందన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ విషయంలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలలో జీడీపీఏ వృద్ధిరేటు 14.90%, పారిశ్రామిక రంగంలో 21.29 శాతం, సర్వీస్ సెక్టార్‌లో 16.01 శాతం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. రబీలో పంటల సాగును 86,000 హెక్టార్ల నుంచి 91,000 హెక్టార్లకు, ప్రకృతి వ్యవసాయాన్ని 26,000 హెక్టార్ల నుంచి 50,000 హెక్టార్లకు, కౌలు రైతులకు పంట రుణాలు రూ.58 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మిరప, పసుపు, కురగాయలు, పూల సాగును 17800 హెక్టార్ల నుంచి 18400 హెక్టార్లకు పెంచాలని, మైక్రో ఇరిగేషన్ పంటల సాగును 12100 హెక్టార్ల నుంచి 14,500 హెక్టార్లకు పెంచాలని, పంట కోతలు జరిగిన తర్వాత, వస్తు కచ్చితత్వానికి సంబంధించి రూ.16 కోట్లు ఖర్చు చేయాలని ప్రణాళికల్లో రూపొందించామన్నారు. మైనింగ్, క్వారీయింగ్‌లో 40 నాన్ వర్కింగ్ మెటల్ లీజ్ ద్వారా 20 లక్షల మెట్రిక్ టన్నులు, 20 నూతన గ్రావెల్ లీజ్‌ల ద్వారా 10 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్, 30 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. 2500 నూతన ఎంఎస్ఎంఈల ఏర్పాటు, రెండు మెగా ఇండస్ట్రీలకు 304.75 హెక్టార్లు భూసేకరణ జరుగుతుందన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా 56 మెగావాట్లు, ఎంటీఎంసీలోని ఐవోసీఎల్ ద్వారా 5000 ఇళ్లకు పైపులైను ద్వారా గ్యాస్ సరఫరా చేయాలని, జల్ జీవన్ మిషన్ ద్వారా 25,000 ఇళ్లకు వ్యక్తిగత కుళాయిలు, 4 ఎంఎల్‌డీ వాటర్ సోర్స్ పెంపుదలకు, పట్టణ ప్రాంతాల్లో 25,000 ఇళ్లకు వ్యక్తిగత కుళాయిలు ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రెండు మూడు లైన్ల ఆర్వోబీలు రూ.454.24 కోట్లుతో, గుంటూరులో శంకర్ విలాస్ ఆర్వోబీ, 200 మీటర్ల అప్రోచ్ రోడ్లు రూ.40 కోట్లతో నిర్మించాలని లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లా జీడీవీఏ 82293(17.36 శాతం), జీడీడీపీ 89639 (17.96 శాతం), తలసరి ఆదాయం రూ.3,54,268 (17.66 శాతం) సాధించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ సహకారం అందించాలి

గుంటూరులో నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు ఆర్థిక సహాయం, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో యూజీడీ పనులకు, మంచినీటి సరఫరా విస్తరణకు, గుంటూరు ఛానల్ అధునీకరణ, విస్తరణకు నిధులు, చినకాకాని, మల్లయ పాలెంలో ఇండస్ట్రీల పార్కు ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రూ.625 కోట్లు, జీజీహెచ్‌లో నిర్మిస్తున్న మెటర్నిటీ వార్డులో పరికరాలు, ఫర్నిచర్‌కు అవసరమైన రూ.30 కోట్ల నిధులకు ప్రభుత్వ సహకారం కావాలని కలెక్టర్ కోరారు. వీటిపై సీఎం మాట్లాడుతూ యూజీడీ పనులు పూర్తి చేస్తామన్నారు.గుంటూరుఛానల్ ఆధునీకరణ, విస్తరణకు, చినకాకాని, మల్లయపాలెం వద్ద ఇండస్ట్రీ పార్కు భూసేకరణకు నిధులు మంజూరు చేయటం జరుగుతుందన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (గురువారం సాయంత్రం) సహరి : 4.50 (శుక్రవారం ఉదయం)

పట్టాభిపురం సీఐగా గంగా వెంకటేశ్వర్లు

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం సీఐగా గంగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తుళ్లూరు సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న గంగా వెంకటేశ్వర్లును పట్టాభిపురం స్టేషన్‌కు బదిలీ చేశారు. ఉత్తర్వులు విడుదలైన వెంటనే వెంకటేశ్వర్లు పట్టాభిపురం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గడచిన ఏడు నెలలుగా ఇక్కడ సీఐ వీరేంద్రబాబును ఇటీవల బదిలీ చేసి ఆ స్థానంలో మధుసూదనరావును నియమించారు. అయితే మధుసూదనరావు వైసీపీ నేతలతో సన్నిహితంగా ఉండటమే కాకుండా టీడీపీ వారిపై పక్షపాతంతో వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతోపాటు ఆయన నియామకం వివాదాస్పదమైంది. దీంతో రెండు రోజుల వ్యవధిలోనే ఆయనను తిరిగి వీఆర్‌కు పంపారు. ఈ క్రమంలో ఖాళీ అయిన పట్టాభిపురం ఎస్‌హెచ్‌వోగా గంగా వెంకటేశ్వర్లును నియమించారు. 1996లో ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరిన ఆయన నెల్లూరు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. 2010లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది సీఐడీ, కృష్ణపట్నం పోర్టు, బుచ్చిరెడ్డిపాలెం, ఒంగోలు తాలూకా, గుంటూరు రైల్వే, తుళ్లూరుల్లో విధులు నిర్వహించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

విజుబుల్ పోలీసింగ్ అమలు

బాధ్యతలు స్వీకరించిన అనంతరం వెంకటేశ్వర్లు విలేకర్లతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ తదితర నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి గస్తీ పెంచడంతో పాటు విజుబుల్ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సిద్ధమవుతున్న పీ-4 ప్రారంభోత్సవ వేదిక

వెలగపూడి సచివాలయం వెనుక శరవేగంగా పనులు

తుళ్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి లోని వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో ఉగాది పర్వదినం రోజున పీ-4 కార్యక్రమ ప్రారంభోత్సవ వేదిక ప్రాంగణంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ధనిక వర్గాల వారు పేదలను దత్తత తీసుకుని వారి ఆర్థిక ఎదుగుదలకు అవకాశం కల్పించి, ఉన్నతంగా తీర్చిద్దే పీ-4 కార్యక్రమానికి ఉగాది పర్వదినం రోజున సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టబోతున్నారు. జిల్లాకు 50 మంది పేదల చెప్పున పీ-4 కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారితో పాటు రాజధాని గ్రామాల ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. బుధవారం ఏర్పాట్లను జేసీ భార్గవతేజ, ఆర్డీవో శ్రీనివాసరావు, పోలీసు అధికారులు ఈ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ

ఈ-క్రాప్‌లో నమోదు.. 230 మంది మాత్రమే
- యార్డులో అమ్మకందారులంతా రైతుల వద్ద కొనుగోలు చేసిన వాళ్లే
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ ఎంఐ స్కీమ్ అమలు అసాధ్యం
- దీనిని అవకాశంగా మార్చుకొంటున్న కొందరు వ్యాపారస్థులు

పేద విద్యార్థినులకు వరం.. కేజీబీవీలు 8



ఉడకని గుడ్డు.. నీళ్లచారు

- ఈ భోజనంతో రోగులు కోలుకుంటారా?
- అన్నక్యాంటిన్‌లో ఆహార పదార్థాలే బాగున్నాయి..
- తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రోగి బంధువుల ఆవేదన

తెనాలి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉడికీ ఉడకని గుడ్డు.. నీళ్లచారు.. నీళ్ల మజ్జిగ.. ఉడకని కూర.. నాణ్యత లేని అన్నం.. నీళ్లపాలు.. ఇవి తిని రోగులు ఏవిధంగా కోలుకుంటారు అని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి నిత్యం వందల మంది రోగులు అనారోగ్యసమస్యలతో చేరుతుంటారు. వార్డులో అడ్మిటైన రోగులకు ఆస్పత్రిలోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనం వంటివి అందిస్తారు. ఇందుకు కాంట్రాక్టర్‌ను నియమించారు. ఈ కాంట్రాక్టర్ పాలు, గుడ్లు, పండ్లు వంటివి కూడా కొన్ని విభాగాల్లో అందించాలి. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రోగులకు సరఫరా చేసే ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించ లేదన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత కూడా గతంలో మాదిరిగానే ఆహారం ఉండటంతో రోగి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట అన్న క్యాంటిన్లో రూ.5కి అందిస్తున్న భోజనం శుచి, రుచితో ఉందంటున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం నాణ్యత లేకుండా అందిస్తున్న భోజనం తింటే రోగికి వ్యాధి తగ్గకపోగా కొత్త జబ్బులు సోకే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కొందరు రోగులకు వంకాయ కూర వంటివి పెట్టకూడదని వైద్యుల సూచనలు ఉన్నా ఆస్పత్రిలో అవే వండి పెడుతున్నారంటున్నారు. బుధవారం ఓ రోగి బంధువు కాంట్రాక్టర్ సరఫరా చేసిన ఆహారాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తూ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆస్పత్రి సిబ్బంది నచ్చజెప్పడంతో ఆయన వెనుదిరిగారు.



ఆసుపత్రిలో ఉడకని గుడ్డు, నీళ్ల-చారుతో రోగికి పెట్టిన భోజనాన్ని సూపరింటెండెంట్‌కు చూపడానికి తెచ్చిన బంధువు

మున్సిపల్ భూమి విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలి

● కేసానుపల్లి 167ఏ జాతీయ రహదారి బాధిత రైతుల డిమాండ్

నరసరావుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ భూమి విలువ ఆధారంగా రైతులకు పరిహారం చెల్లించాలని కేసానుపల్లి 167ఏ జాతీయ రహదారి బాధిత రైతులు డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలో ఆర్డీవో ఎం మధులతకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేసానుపల్లి రైతుల పొలాల మార్కెట్ విలువ ఎకరం రూ. 3 నుంచి రూ. 5



ఆర్డీవో ఎం మధులతకు వినతిపత్రం అందజేస్తున్న కేసానుపల్లి రైతులు

కోట్ల వరకు ఉందన్నారు. కొన్ని పొలాలు ఎల్‌టీనగర్‌కు దగ్గరగా ఉన్నాయని, మున్సిపాలిటి రిజిష్టర్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. కేసానుపల్లి పొలాలకు దగ్గరలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఫార్మసీ కాలేజి, ఇంజనీరింగ్, న్యాయ కళాశాల, అగ్రికల్చర్ కాలేజీలు ఉన్నాయన్నారు. 167-ఏ జాతీయ రహదారి కింద భూమిని కోల్పోతున్న రైతులందరికీ నరసరావుపేట రెవెన్యూ రైతులకు ఇచ్చిన పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోట్ల లక్ష్మీనారాయణ, వెంకట గోపి, తాతపూడ సంజీవరావు, మంచు సునీత, కోట కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వివాద స్థలంలోకి ఇరువర్గాలను అనుమతించవద్దు

● తహసీల్దార్ ఉత్తర్వులు

ఫిరంగిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని శాంతిపేటలో గల 3.50 సెంట్ల వివాద స్థలంలోకి ఇరువర్గాలను అనుమతించవద్దని స్థానిక ఎస్ఐకి తహసీల్దార్ కే ప్రసాద్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న స్థల వివాదంలో సీఐ దురుసు ప్రవర్తనతో ఓ వ్యక్తి ని తుపాకితో కొట్టడం, ఆపై స్థానికులు సీఐని తరిమికొట్టడం, సీఐ సైడ్ కాల్వలో పడిపోటం, 3 గంటల పాటు రాస్తారోకో చేశా రు. దీంతో శాంతిపేటకు చెందిన ప్రజలు స్థానిక తహసీల్దార్, డీఎస్పీ టీ మురళీకృష్ణ, పంచాయతీ ఈవోలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వివాద స్థలం.. పోలేరమ్మ గుడి స్థలంగా 3.50 సెంట్ల స్థలం ఉన్నదని, దీనిని గ్యారా చిన్నికుమార్ తన ఇద్దరు కుమారులకు గిఫ్ట్ డీడీగా ఇచ్చారని తెలిపారు. దీనిపై కాలనీవాసులు అధికారులకు వినతి పత్రాల ద్వారా విషయం తెలిపిన సందర్భంగా.. వివాదాలు చెలరేగుతాయనే నేపథ్యంలో సీఆర్‌పీసీ 145 కింద ఆరు నెలల పాటు ఇరువర్గాలు ఆ స్థలంలోకి వెళ్లకుండా చూడాలని తహసీ ల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.



వివాద స్థలంలో కొలతలు తీస్తున్న అధికారులు



శాంతిపేటలో ఇరువర్గాల సమక్షంలో కొలతలకు సిద్ధమైన అధికారులు

● కొలతలు తీసిన రెవెన్యూ అధికారులు

శాంతిపేటలో వివాదంలో ఉన్న స్థలంలో బుధవారం రెవె న్యూ, పంచాయతీ అధికారులు కొలతలు తీశారు. ఇరువర్గాల పెద్దల సమక్షంలో అధికారులు కొలతలు వేశారు. కార్యక్రమంలో ఆర్.ఐ షేక్ రెహమన్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో శ్రీనివాస్, ఈవో కిషోర్‌బాబు, సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారులు రాష్ట్రఖ్యాతిని పెంచాలి

◆ శాప్ చైర్మన్ రవినాయుడు ◆ వీవీఐటీయూలో నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్

పెదకాకాని, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ క్రీడాకారులు అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రఖ్యాతిని పెంచాలని శాప్ చైర్మన్ రవినాయుడు కోరారు. వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ "నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్" పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు, అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత సంజీవ సింగ్, వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆర్చరీ క్రీడకు విశేష ఆదరణ లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆర్చరీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న చెరుకూరి లెనిన్ వోల్గా అసోసియేషన్ కృషి ప్రశంసనీయం అన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం అని తెలిపారు. అమరావతి వేదికగా స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునట్లు వివరించారు. వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మార్చి 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు వీవీఐటీయూ క్యాంపస్ నందు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి 900 మంది ఆర్చరీ క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారని, అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించనున్న పోటీలలో తొలి రోజున 723 మంది పోటీదారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీయూ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్. అరుణ్ కుమార్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరి చెరుకూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్ రవినాయుడు, వీవీఐటీయూ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

నేడు గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు


● అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోటీ

గుంటూరు(లీగల్), మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్‌కు 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి యంగలశెట్టి శివ సూర్యనారాయణ (బబ్లూ), మధిర నాగేశ్వరరావు, కాజా భరద్వాజ, నంబూరు పాములు నలుగురు పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి మాలే దేవరాజు, చింతా రామ కోటిరెడ్డిల మధ్య ద్విముఖ పోరు జరుగుతుంది. ప్రధాన కార్యదర్శి పదవికి యరసాని అజయ్ కుమార్, మొఘల్ కాలేషా బేగ్, మోదుకూరి శ్రీనివాసరావు లు ముగ్గురు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరి పదవికి కొమ్మినేని చంద్రశేఖర్, ఐ విజయ్ వర్మల మధ్య ద్విముఖ పోరు నడుస్తుంది. ట్రెజరర్ పదవికి గూడూరి అశోక్ కుమార్, జీవీఎస్ఆర్‌కేఎస్ చంద్రస్ లు, లైబ్రరి సెక్రటరి పదవికి ఎం పాపిరెడ్డి, బొప్పా శ్రీనివాసరావులు పోటీలో ఉన్నారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరి పదవికి కుప్పాల హనుమంతరావు, గండికోట శేషగిరిరావులు పోటీ పడుతుండగా, లేడీ రెప్రజెంటేటివ్ పదవికి అడపా ఇందిర, పురాణం కళ్యాణిలు పోటీలో ఉన్నారు. నాలుగు సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు గాను మోర్ల బాల సుందరి, దాదా కరీం మొహమ్మద్, బండ్ల కృష్ణ, పల్లె నరసింహారావు, పొట్టిమూర్తి సురేష్‌కుమార్‌లు పోటీలో ఉన్నారు. మూడు జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు లింగాల మారుతీ శివ నాగప్రసాద్, షేక్ రెహానా బేగం, పెరుమాళ్ళ శివరంగ నాయకులు, రాయపూడి శ్రీనివాసరావులు నలుగురు పోటీపడుతున్నారు. లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు కుందేపు కవిత, మందా విజయ కుమారిల మధ్య ద్విముఖ పోరు జరుగుతోంది. మొత్తం 2016 మంది న్యాయవాదులకు ఈ ఎన్నికలలో ఓటు హక్కు వుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి 5 గంటల నుంచి పోల్ అయిన ఓట్లు లెక్కించి ఫలితాలు రాత్రికే వెల్లడించనున్నారు.

ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ పనులను రూ.1112.74 కోట్లతో చేపడుతున్నారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆయా ప్రాంగణాల్లో జంగిల్ క్లియరెన్స్ చేశాయి. అసంపూర్తిగా నిలిచిన భవనాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాల్ని తొలగిస్తూ మొత్తం ప్రాంతాన్ని శుభ్రం చేయించాయి. 2019 నాటికి కొన్ని 90 శాతం, మరికొన్ని 50 శాతం, ఇంకొన్ని పునాదుల దశ వరకు నిర్మాణపనులను జరుపుకున్నాయి. వీటిని అన్ని హంగులతో, పూర్తి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గెజిటెడ్ అధికారులు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-డీ అధికారుల కోసం మరో 1440 ఫ్లాట్ల నిర్మాణాన్ని గత టీడీపి ప్రభుత్వ హయాంలో చేపట్టగా అవి 66శాతం వరకు పూర్తయ్యాయి. ఇక నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కోసం నేలపాడు వద్ద మరో 1995 ఫ్లాట్లు వచ్చే విధంగా బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణాలను చేపట్టి 62 శాతానికి పైగా పూర్తి చేశారు. వీటన్నింటిని ఇపుడు మళ్లీ పూర్తిస్థాయిలో పునర్నిర్మించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించగా 2019లో నిలిచిపోయాయి. ముళ్ల కంపల నడుమ పాడుపడినట్లున్న ఈ భవన సముదాయాల పనులను ప్రభుత్వం తాజాగా చేపట్టింది. నిర్దేశించిన గడువుకన్నా ముందరే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆయా సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో గడువు పెంచేది లేదని తేల్చిచెప్పింది. నాణ్యత విషయంలో రాజీ పడటానికి వీలులేదని సూచించింది. ఈ భవన సముదాయాల్లో అంతర్గత రహదారులను ఏర్పాటుచేయడంతోపాటు ఇంటీరియర్ వర్కులు, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.



అమరావతిలో పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

ప్రకృతి వ్యవసాయం కోసం కలిసికట్టుగా పనిచేయాలి

రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామారావు

గుంటూరు సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ రామారావు స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ, సెర్ప్ సంస్థల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేస్తోందని, జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం గుంటూరు పట్టణంలోని రాయల్ పార్క్ హోటల్ నందు బుధవారం ప్రారంభమైనది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వ్యవసాయ శాఖకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ నుంచి డీపీఎం, ఏపీఎం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సలహాదారులు,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ డీవీ రాయుడు మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయం కారణంగా మొక్కలు, సూక్ష్మజీవుల మధ్య ఉండే సంబంధం బాగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిలో ఉచితంగా లభ్యం అయ్యే సూర్యకాంతిని వ్యవసాయ రంగానికి సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా పంట ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. ప్రొఫెసర్ దభోల్కర్ పరిశోధనలను ప్రస్తావిస్తూ బహుళ పంటల సాగు విధానాలు ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు ఎకరాలకు సమానమైన ఉత్పాదకతగా మార్చగలవని వివరించారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభాలు ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. అధిక రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా భూసారం తగ్గిపోవడం, కార్బన్ వ్యర్థాలు పెరగడం, నీటి కాలుష్యం వంటి ప్రభావాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం మెరుగుపడి, దిగుబడి పెరిగి, ఆహార పోషక విలువలు మెరుగవ్వడంతో పాటు పర్యావరణ స్థిరత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మేనేజ్ సంస్థ టెలీ సలహాదారు ఐశ్వర్య, సీనియర్ థిమాటిక్ లీడ్‌లు చంద్రశేఖర్, గోపీచంద్, డాక్టర్ జాకీర్ హుసేన్, థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ రామచంద్రం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు, చిత్రంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీవీ రాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

అద్దె బకాయిలు చెల్లించకపోతే చర్యలు

● పెదనందిపాడులో రూ.9.92 లక్షల వసూలు.. జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెదారులు బకాయిలు వెంటనే చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ హెచ్చరించారు. బుధవారం ఆయన గుంటూరు జిల్లా పరిషత్‌లో మాట్లాడుతూ జడ్పీ అద్దె బకాయిల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో భాగంగా పెదనందిపాడులో రూ.16.74 లక్షలు అద్దె బకాయిలు ఉండగా, స్పెషల్ డ్రైవ్ లో రూ.9.92 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు. చాలా మంది జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లు వాడుకుని అద్దెలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వుంటున్నారని, అటువంటి వాళ్ళ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.

29 జరగాల్సిన జడ్పీ సమావేశం వాయిదా

గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదీన గుంటూరులో జరగనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా బుధవారం తెలిపారు. 2025 - 2026 సంవత్సర బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలను అదనంగా చేర్చవలసి ఉన్నందున, మెజార్టీ సభ్యులు కొంత సమయం కోరిన కారణంగా వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

4 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 4న రాత్రి 7.30గంటలకు చిగురు మేఘం, 9..30కు కిడ్నాప్, 10.30కు విడాకులు కావాలి, 5న రాత్రి 7.30కు జనరల్ బోగీలు, 8.30కు నా శత్రువు, 9.30కు రుతువులేని కాలం, 10.30కు గురితప్పిన వేట, 6న రాత్రి 7.30కు నాన్న నేను వచ్చేస్తున్నా, 8.30కు బ్రహ్మస్వరూపం, 9.30కు బావా ఎప్పుడు వచ్చితివి మొదలగు నాటికలు ప్రదర్శితమవుతాయని సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

మాచర్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఐసర్ వెహికల్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణ శివారులోని ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా అర్థవీడు మండలం నారాయణపల్లికి చెందిన ఎస్ ఇంద్రసేనారెడ్డి (26), ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన కాశిరెడ్డి (30)లు హైదరాబాద్ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం (ఏపీ39ఎన్‌క్యూ 1977)పై మాచర్ల వైపు వస్తుండగా ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద మాచర్ల వైపు నుంచి మొక్కజొన్న లోడుతో వెళ్తున్న ఏపీ29టీఏ 7692 ఐసర్ వెహికల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇంద్రసేనారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కాశిరెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన ఐసర్ వెహికల్ డ్రైవర్ పరారయ్యాడు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇంద్రసేనారెడ్డి ఆర్మీ జవానుగా విధులు నిర్వహిస్తున్నారు.



ఇంద్రసేనారెడ్డి (ఫైల్)

హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

మంగళగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. తాడేపల్లికి చెందిన సంధ్యారాణిపై భర్త తగరపు నాగరాజు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు సంధ్యారాణి సెప్టెంబరు 3, 2022న ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టు విచారణలో నాగరాజుపై నేరం రుజువు కావడంతో నాగరాజుకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని బుధవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెంటపల్లి రాజేష్ బాధితురాలి తరపున వాదనలు వినిపించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : స్కూటీపై ఇంటికెళుతున్న ఓ వ్యక్తి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కంకటపాలెం గ్రామానికి చెందిన రావిపూడి సురేష్‌బాబు (66) బుధవారం స్కూటీపై బాపట్ల వచ్చి తిరిగి ఇంటికెళ్ళే సమయంలో విలియంబూత్ జూనియర్ కళాశాల వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. పడిపోయిన ఆయనను స్థానికులు 108 ద్వారా ఏరియావైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రావిపూడి సురేష్ (ఫైల్‌ఫొటో)

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 521.20 అడుగులు ఉంది. ఇది 151.47 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 25,036 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,45,568 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,46,260 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,45,568 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 70,065 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12000
334	9500	12600	బ్యాడిగి 355	10000	13000
నంబరు. 5	10000	13100	సింజెంటా		
273	10000	12600	బ్యాడిగి 5531	--	--
341	10000	14100	దేవనూరు డీలక్స్	10200	12500
4884	10000	11700	ఆర్మూరు	10000	11200
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10000	13300			

పైపులైను మరమ్మతులు చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో తాగునీటి పైపులైన్ మరమ్మతులు ఎప్పటి కప్పుడు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ పెద్దపలకలూరు, అడవితక్కెళ్లపాడు, నాయీబ్రాహ్మణకాలనీ, నల్లపాడు, రాజీవ్‌గాంధీ నగర్, వల్లూరివారితోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇంజనీరింగ్ అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ సాంబిరెడ్డి, డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈ లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించడానికి కేవలం 5 రోజులే గడువు

2024-25 సంవత్సరం ఆస్తిపన్ను చెల్లించటానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉందని, పన్ను బకాయిలు ఈ నెలాఖరులోపు ఏకమొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని, పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం దృష్ట్యా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు మెయిన్ ఆఫీస్‌లోని ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లను పరిశీలించారు.

శంకర్‌విలాస్ బ్రిడ్జి కోసం 120 అడుగుల రోడ్డు విస్తరణ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా జీఎంసీ చేపట్టిన 120 అడుగుల రోడ్డు విస్తరణలో ప్రభావితమయ్యే భవనాలకు నష్టపరిహారం, స్థలాలకు టీడీఆర్ బాండ్లను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిస్తామని కమిషనర్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే భవనాల యజమానుల్లో కోర్టుని ఆశ్రయించిన వారితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆర్‌వోబీ నిర్మాణ టెండర్లు ఈ నెలాఖరు నాటికి ఫైనల్ అవ్వడం, ఏప్రిల్ 15 తర్వాత పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం నగర పరిసరాల్లో మార్కెట్ విలువపై 2 రెట్లు నష్టపరిహారం ఇస్తారని, అదే చర్చల ద్వారా అంగీకారపత్రం ఇస్తే కోల్పోతున్న భూమికి 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లు ఇస్తారని తెలిపారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈ పాల్గొన్నారు.

నేడు జీఎంసీలో ప్రత్యేక గ్రీవెన్స్

జీఎంసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్ర స్థాయిలో కార్మికులు ప్రధానంగా పీఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనధికార కట్టడాల క్రమబద్ధీకరణకు 31తో గడువు ముగింపు

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో అనధికార లేఔట్లు, ప్లాట్లు అనుమతి లేకుండా, అనుమతి పొంది ప్లానుకు భిన్నంగా నిర్మించిన భవన సముదాయాలను లేఔట్ స్కీం, బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకొనుటకు ఈ నెల మార్చి 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఏటీ అగ్రహారం ప్రాంత సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏటీ అగ్రహారం ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అభివృద్ధి వేదిక నాయకులు కమిషనర్ పులి శ్రీనివాసులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జీరో లైన్ నుంచి ఐదో లైను వరకు మెయిన్ రోడ్డు నిర్మాణం, కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న పారిశుధ్యం సమస్య, రైల్వే అండర్ బ్రిడ్జి పరిశుభ్రత, చుట్టుగుంట వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పిల్లలకు ప్లే గ్రౌండ్, లైబ్రరీ, రీడింగ్ రూమ్ ఏర్పాటు, కుక్కల బెడద సహా పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేసిన వారిలో అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎండీ అక్బర్, విశ్రాంత ఇంజనీర్ జి.వెంకట్రావు ఉన్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వండి

● అధికంగా సిజేరియన్లు చేస్తున్న ఆస్పత్రులకు నోటీసులు

● వైద్యులకు అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ ఆదేశం

గుంటూరు మెడికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు (మాతా శిశు ఆరోగ్యం) డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆ శాఖ పనితీరుపై జిల్లా ప్రోగ్రామ్ ఆఫీస ర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తొలుత డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలను వివరించారు. అనంతరం డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా ప్రైవేటు వైద్యరంగంలో వందశాతం సిజేరియన్లు జరిగిన ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారి నుంచి వివరణ తీసుకోవాలని తెలిపారు. సంబంధిత ఆస్పత్రుల్లో జిల్లా టీమ్‌లతో పరిశీలన చేయించి నివేదిక ఉంచాలని ఆయన ఆదేశించారు. హెచ్‌ఎంఐఎస్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల నమోదు వందశాతం జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు రక్త పరీక్షలన్నింటిని సకాలంలో నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల్లో రోగులకు అందుబాటులో ఉంచిన మందుల వివరాలను ప్రతి రోజూ ప్రదర్శించాలని తెలిపారు. ఈ సందర్భంగా 30 మంది నర్సింగ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, గైడ్‌లైన్ బుక్స్, డిజిటల్ ట్యాబ్లెట్, యూనిఫారం, బూట్లు, నేమ్‌ప్లేట్‌లతో కూడిన కిట్లను అనిల్‌కుమార్ అందజేశారు.



సమీక్షలో ఏడీ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత, ప్రజా సంఘాలు, పాస్టర్లు డిమాండ్ చేశారు. భీమ్‌సేన సేవాదళ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్ నుదురుపాటి చంద్ర మాట్లాడుతూ పాస్టర్లపై దాడులను క్రైస్తవ మతంపై దాడులుగా భావిస్తున్నట్టు తెలిపారు. క్రైస్తవాన్ని బలోపేతం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగటం దారుణమన్నారు. ప్రవీణ్ పగడాల పోస్టుమార్టం నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయకపోవడంపై అనేక అనుమానాలు వస్తున్నాయని అన్నారు. తక్షణమే పోస్టుమార్టం నివేదికను వెల్లడించాలని డిమాండ్ చేశారు. పాస్టర్లపై దాడులను ఖండిస్తూ 30న నగరంలో లాడ్జి సెంటర్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నార్త్ ప్యారిస్ చర్చి పాస్టర్ సీహెచ్ బాబురావు, నల్లపు నీలాంబరం, మంచాల జోసెఫ్, డేవిడ్ విలియమ్స్, బత్తుల అనిల్, మద్దు ప్రేమ్ జ్యోతిబాబు, మల్లెల రాజు, జయసుధ పాల్గొన్నారు.



లాడ్జి సెంటర్లో నిరసన తెలుపుతున్న పాస్టర్లు దళిత, ప్రజాసంఘాలు


పరీక్షల వేళ పెరిగిన కోతలు

● విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

● గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వైనం

● పరికరాల కొరత అంటున్న సిబ్బంది

ఎండలు మండుతోన్న కొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో మినహా మండల, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువవుతున్నాయి. పగటి పూటే అధికం గా విద్యుత్ అంతరాయాలుంటున్నాయి. ఇక రాత్రి సమయాల్లో ఎప్పుడు అంతరాయాలు వస్తాయో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అసలే పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు , మరో వైపు మండుతోన్న ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవు తుంటే మరో వైపు విద్యుత్ కోతలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి.



గుంటూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్‌లోని పలు సెక్షన్‌లోనూ విద్యుత్ అంతరాయాలు నెలకొంటున్నాయి. ఇక బాపట్ల సర్కిల్ పరిధిలోని బాపట్ల డివిజన్‌లో కర్లపాలెంలోని నందిరాజుతోట, యాజిలి, నల్లమోతు వారి పాలెం, కంకటపాలెం, పీపీపాలెం, అమృతలూరు, వేమూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉంటున్నట్లు సమాచారం. ఇక పల్నాడు జిల్లా సర్కిల్ పరిధిలోనూ రాజుపాలెం, నాదెండ్ల, దుర్గి, కారంపూడి ఆయా ప్రాంతాల సెక్షన్‌ల పరిధిలో కూడా విద్యుత్ అంతరాయాలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. రాజుపాలెం మండలం ఇనుమెట్ల గ్రామంలో అయితే కొన్ని సార్లు పగలంతా విద్యుత్ సరఫరా ఉండని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితులున్నాయి. సాంకేతిక కారణాలని అధికారులు పైకి చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ వైఫల్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌ల పరిధిలో విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) పేరుతో రోజుల తరబడి పనులు చేస్తుండటం కూడా ప్రజల్లో అసహనం కలిగిస్తోంది. ప్రతి నెలలో రెండో శనివారం విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉదయం నుంచి మధ్యాహ్నం, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాధారణ రోజుల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతోన్న వేసవితో గుంటూరు సర్కిల్ పరిధిలోని ఐదు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌లో దాదాపు 15 మిలి యన్ యూనిట్లపైనే విద్యుత్ వినియోగం జరుగుతుంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ఉన్నప్పటికీ అంతరాయాలు రావటం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

స్టోర్స్‌లో పరికరాల్లేవంటూ విమర్శలు...

విద్యుత్ లైన్‌లకు సంబంధించి 11 కేవీ తీగెలు, స్విచ్‌లు, ఎర్త్ వైర్లు, కండక్టర్‌లు, కేబుల్స్ వంటివి సెక్షన్ కార్యాలయాల పరిధిలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సెక్షన్‌ల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకున్న నాధుడే ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాపం ఇప్పుడు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌లలో ఒకరు మాత్రమే లైన్‌మెన్ ఉండటం కూడా విద్యుత్ అంతరాయాలకు కారణాలుగా చెబుతున్నారు.



సమీక్షలో మాట్లాడుతోన్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన అదనపు ఎస్పీలు సుప్రజ, రమణమూర్తి తదితరులు

శాంతి భద్రతల పరిరక్షణలో సాంకేతికతకు ప్రాధాన్యం

● పోలీసింగ్‌లో టెక్నాలజీతో ఉత్తమ ఫలితాలు

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో డీజీపీ పోలీస్‌శాఖకు సంబంధించి ప్రదర్శించిన వివిధ అంశాలు, సాంకేతిక పరిజ్ఞానంతో వస్తున్న ఫలితాల గురించి పోలీస్ అధికారులతో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ రంగాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సాంకేతికతను పోలీసింగ్‌లో కూడా ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టవచ్చని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రదర్శించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా పోలీస్ అధికారులకు వివరించారన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 'నేర సమగ్ర సమాచారం'ను తయారు చేసుకుని, వాటికి ముఖ్యమైన 'నేరస్థలాలను, ప్రదేశాలను అనుసంధానం చేసి, నేరస్తులను, నేరాల కారకులను కనిపెట్టి, వారిని కట్టడి చేసే విధంగా పోలీస్ సిబ్బందితో గస్తీని, సాంకేతికతను ఉపయోగించి డ్రోన్ గస్తీని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జావీ రమణమూర్తి, (అడ్మిన్), సుప్రజ(క్రైమ్స్), డీఎస్పీలు శివాజీ రాజు, రమేష్ (ట్రాఫిక్), సుబ్బారావు(మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ) పలువురు డీసీఆర్‌బీ, డీటీఆర్‌బీ, ఐటీ, మహిళా పోలీస్‌స్టేషన్, సీసీఎస్, వేలి ముద్రల విభాగం మొదలగు ఆయా విభాగాల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్స్ వద్ద ముందు జాగ్రత్త చర్యలు

● నగరంలో ప్రమాదాల నియంత్రణపై ట్రాఫిక్ పోలీసుల దృష్టి



బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలించి సంబంధిత వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, అధికారులకు ఆదేశాలిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరు గుతున్న బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రమాదాల నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన వెస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో ఇటీవల తరచూ రోడ్డు ప్రమా దాలు జరుగుతున్న ప్రాంతా లను వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్యతో కలసి పరిశీలిం చారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేర కు నగరంలోని పలు (బ్లాక్ స్పాట్స్) ప్రమాద ప్రదేశాలు, ట్రాఫిక్ రద్దీ ప్రదేశాలను పరిశీలించి, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఆయా ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఐ సింగయ్యని, ఇతర పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీహరి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ టి.స్వరూపరాణి తదితరులు

యువత మానసిక స్థితిగతులపై 28, 29 తేదీల్లో సదస్సు

గుంటూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యువత మానసిక స్థితిగతులపై ఈనెల 28, 29వ తేదీల్లో సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.స్వరూపరాణి తెలిపారు. సాంబశివపేటలోని కళాశాలలో బుధవారం సదస్సు బ్రోచర్, ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ గ్లోబల్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (జీసీపీఏ), సెయింట్ జోసెఫ్ మహిళా బీఈడీ కళాశాల సంయుక్తంగా తొలిసారిగా అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'సైకో సోషల్ కాంపెటెన్సీస్ ఫర్ గ్లోబల్ యూత్' అనే అంశంపై ఏర్పాటు చేస్తున్న సదస్సు ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, గుంటూరు జేఎంజే ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ విజయమేరీ, పలువురు ప్రజా ప్రతినిధులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటుండగా, ఎస్వీయూ పూర్వ వీసీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొంటారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఏ.రోజిలీన్, అసోసియేట్ ప్రొఫెసర్ బీ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ టీఎస్ సుభాషిణి పాల్గొన్నారు.

3న విజయవాడలో రైతు సదస్సు

గుంటూరు(తూర్పు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేక నల చట్టాలకంటే మరింత ప్రమాదకర చట్టాలను తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 3న విజయవాడ, హనుమంతరాయ గ్రంథాలయంతో రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశాఖ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చలసాని రామచంద్రరావు హాజరవుతున్నట్లు తెలిపారు. సదస్సులో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి రంగారెడ్డి, పి.శివాజీ, కె.విఠల్‌రెడ్డి, జగన్నాథం పాల్గొన్నారు.

గెట్ టు గెదర్ సేవలు స్ఫూర్తిదాయం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు

గుంటూరు(తూర్పు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పేద ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా నిలబడుతున్న గెట్ టు గెదర్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళా వేదికపై బుధవారం గెట్ టు గెదర్ 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు. తొలుత సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మన్నె సుబ్బారావు గెట్ టుగెదర్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజంటే షన్ ద్వారా వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆలపాటి రాజేంద్రప్ర సాద్ విద్యార్థినులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. అతిథులుగా పారిశ్రామిక వేత్తలు కొత్త సుబ్రహ్మణ్యం, దాసరి రామకృష్ణ, పెద్ది శివరామ ప్రసాద్, ప్రముఖ వైద్యులు డా.యడ్లపల్లి సుబ్రహ్మణ్యం, దాసరి హనుమంతరావు, నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఉపకారవేతనాలు పంపిణీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాదు తదితరులు

ఔషధ నిరోధకత తగ్గించే దిశగా ల్యాబ్ సేవలు



రీసెర్చ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సుందరాచారీ

గుంటూరు మెడికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యాంటీ బయోటిక్ మందులకు ఔషధ నిరోధకత పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో ఔషధ శాస్త్ర మెడికల్ పీజీ విద్యార్థుల పరిశోధన కోసం ప్రయోగశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. బుధవారం జీఎంసీ ఫార్మకాలజీ విభాగం లో ఆధునీకరించిన మెడికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీని ఆయన ప్రారంభించా రు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కే శంకర్ వ్యక్తిగతంగా అందజేసిన రూ.2 లక్షలు విరాళంతో ఈ ల్యాబ్‌ను ఆధునికీకరించారు. తన తండ్రి తహసీల్దార్ కుర్లి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఈ నిధులు విరాళంగా అంద జేశారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతున్న పరిస్థితుల్లో వీటిపై మరింత పరిశోధన చేసేందుకు ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడతుందని డాక్టర్ సుందరాచారీ తెలిపారు. ఈ సం దర్భంగా నిధులు అందజేసిన ప్రొఫెసర్ శంకర్‌ను అభినందించారు.

భవిష్యత్తు అవసరాలు తీర్చే విధంగా బ్రిడ్జి నిర్మాణం జరగాలి

గుంటూరు(తూర్పు), మార్చి 26(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలు, బహుళ ప్రయోజనాలతో కూడిన నూతన ఫ్లైఓవర్ నిర్మాణం జరగాలని శంకర విలాస్ ఫ్లైఓవర్ సాధన ఐక్య కార్యాచరణ సమితి నాయకుడు ఎల్ ఎస్ భారవి పేర్కొన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో నెలకొన్న అపోహాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ బ్రాడీపేట నుంచి అంబేద్కర్ కూడలి వరకు ప్రజా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా రూపొందించిన డీపీఆర్‌తో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే అది ఏమాత్రం భవిష్యత్తు అవసరాలు, బహుళ ప్రయోజనాలు తీర్చే విధంగా ఉండదని స్పష్టం చేశారు. ముందు ఆర్‌యూబీ కట్టిన తర్వాతే పైన ఫ్లైఓవర్ కట్టాలని, ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా కనీసం 3 అడుగుల సర్వీస్ రోడ్లతో పాటు సింగిల్ పిల్లర్ మెట్రో ఫైట్ సిస్టంపై ఓవర్ ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. గతంలో మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ప్రకటించిన రూ.147 కోట్లతో ఫ్లైఓవర్ ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంక టేశ్వర్లు, అవగాహన శివరామరెడ్డి, రేట్ అసోసియేషన్ వల్లూరు సదాశివ రావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో పాల్గొన్న పౌర, వర్తక వ్యాపార, సంఘాలు



ప్రజాదర్బారులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రజల చెంతకే పరిష్కారం : ఎమ్మెల్యే నసీర్

● ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరణ

గుంటూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయిన వారందరి చెంతకే పరిష్కారం తీసుకువస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిదో డివిజన్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల అమల్లో భాగంగా ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. రేషన్ కార్డు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నామని కొందరు, పింఛను తీసేశారని కొందరు, నీళ్లు ఒక రోజు వస్తే ఇంకోరోజు రావడంలేదని మరికొందరు తమ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యల్లావుల అశోక్, ధనలక్ష్మి, జాగర్ల మూడి శ్రీనివాసరావు, జ్యోతుల జస్వంత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, జాడ సతీష్, శీనునాయక్, ఐలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

● టీడీపీకి కార్యకర్తలే నిధి!

అధినేత ఎంత గొప్పవారైనా, కార్యకర్తల మద్దతు లేకుండా విజయం సాధించడం అసాధ్యమని, టీడీపీకి కార్యకర్తలే నిధి అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలకు తోడుగా ఉంటానని చెప్పారు.



ప్రజా గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

వైసీపీ వైఫల్యాలతోనే ప్రజాసమస్యల వెల్లువ

● 'గ్రీవెన్స్ డే'లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అవినీతి, కక్ష పూరిత రాజకీయాలతో గత వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కాలం గడిపేశారని, ఫలితంగా నేడు ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు వెల్లువెత్తుతున్నాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆమె 'ప్రజా గ్రీవెన్స్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిం చాలన్న లక్ష్యంతో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవ లను మరింత చేరువ చేయటానికి ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్‌తో అనేక సేవలను అంది స్తున్నామన్నారు. మరో ముందడుగు వేసి ప్రతి బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నామని చెప్పారు. 'మీతోనే నేను' కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో పర్యటించటంతో పాటు, వారానికి 4 రోజులు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నానన్నారు. ప్రధానంగా డివిజన్లలో కనీస మౌలిక సదుపాయాలు అయిన డ్రైన్లు, రోడ్లు, మంచినీటి సమస్యలు తీర్చాలని కోరుతున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు రూరల్ మండలం ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక

గుంటూరు(తూర్పు), మార్చి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ బంగ్లా రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రూరల్ మండలం ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉపాధ్యక్షురాలుగా ఉన్న ఇంటూరి పద్మావతి ఎంపీపీగా ఎన్నుకోవటంతో ఆ ఖాళీని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక కార్యక్రమం నిర్వహి స్తున్నట్టు పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

గుంటూరు సిటీ, కొత్తపేట కాపురస్తులైన **తాడేపల్లి వెంకట కుమారగుప్త** తండ్రి **వీరభద్రరావు** గారి సంజాయిషీ పొంది తెలియజేయునది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని సన్నిధి వెంకట రాజేంద్రప్రసాద్ మరియు వీరి భార్య **సన్నిధి మల్లేశ్వరి** గారు ది. **28-12-2002**, ద.నెం. **9453/2002 పొన్నెకంటి హనుమంతరావు గారి భార్య పొన్నెకంటి లక్ష్మీ కామేశ్వరి నరసుబాయి** మరియు వారి కుమారులు, కుమార్తెలు అయిన **పొన్నెకంటి వెంకట చంద్రశేఖరరావు, పొన్నెకంటి శేషతల్పసాయి, భట్టిప్రోలు లక్ష్మీ సువర్చలా దేవి భర్త రఘునందన్ కొల్లిమర్ల శారద భర్త సుబ్రహ్మణ్యం** వారి వద్ద విక్రయం పొంది యున్నారని తెలిపియున్నంతలో సదరు ఆస్తికి సంబంధించిన దస్తావేజులో పొన్నెకంటి చంద్రశేఖరరావు గారు ది. 25.07.1944న ఒక అన్ రిజిష్టరు వీలునామా రాసి ది. 03.08.1944న కాలం చేసియున్నారు. దరిమిలా సదరు పొన్నెకంటి చంద్రశేఖర రావు గారి వీలునామాలోని సారాంశము ప్రకారం వారి దత్తత కుమారుడైన పొన్నెకంటి హనుమంతరావు గారు షెడ్యూలు దాఖలా ఆస్తిని స్వాధీన పరచుకొని దరిమిలా పొన్నెకంటి హనుమంతరావు గారు ది. 09.02.2000 తేదీన ఒక అన్ రిజిష్టర్ వీలునామా రాసి ది. 01.08.2002వ తేదీన కాలం చేసియున్నారు. సదరు పొన్నెకంటి హనుమంతరావు గారి వీలునామాలోని అంశముల ప్రకారం వారి భార్యయైన పొన్నెకంటి లక్ష్మీ కామేశ్వరి నరసుబాయి గారికి జీవిత కాలపు హక్కులు మరియు పైన తెలిపిన వారి కుమారులకు పూర్తి హక్కులు ఉన్నవని తెలిపిన వారి కుమార్తెలను కూడా పార్టీలుగా చేర్చుకొని నా క్లయింటు అమ్మకపు దారులైన సన్నిధి వెంకట రాజేంద్రప్రసాద్ మరియు వీరి భార్యయైన సన్నిధి మల్లేశ్వరి గారు దస్తావేజును పొందియున్నారు. ఇట్టి స్థితిలో షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింట్ విక్రయం పొందు విషయంలో ఎవరికైనా అభ్యంతరములు కాని ఆక్షేపణలు కాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన ఏడు రోజులలోగా ఈ దిగువ చిరునామాకు లిఖిత పూర్వకముగా తెలియజేయవచ్చును. అట్లు తెలియపరచని యెడల సదరు ఆస్తిపై ఎట్టి ఆక్షేపణలు లేవని భావించి నా క్లయింట్ విక్రయం పొందగలరు.

షెడ్యూలు : గుంటూరు డిస్ట్రిక్ట్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, రైలుపేట మునిసిపల్ డోర్ నెం. 9-7-2గా గల ఆస్తికి హద్దులు, **తూర్పు :** తవ్వా వెంకటేశ్వర్లు గారి యింటి గోడ హద్దు - అ.42లు, **దక్షిణం :** పొన్నెకంటి మస్తాన్‌రావు గారి ఆస్తి హద్దు - అ. 63లు, **పడమర :** అ.18లు వెడల్పు గల రోడ్డు హద్దు అ. 42లు, **ఉత్తరం :** అ. 24లు వెడల్పు గల రోడ్డు హద్దు - అ. 63లు. ఈ హద్దుల మధ్య గల **294 చ.గ (లేక) 245.82 చ.మీ.** స్థలము అందులోని యం.టి.సి. డాబా యిల్లు వగైరా యావచ్ఛిశిష్ట ఆస్తిన్నీ సహా.

ఇట్లు : **MATTUPALLI VENKATA SUBBA RAO,** Advocate, 8-9, Main Road, Arundelpet, Guntur - 522 002



- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కేజీబీవీలు..
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్

పేద విద్యార్థినులకు వరం.. కేజీబీవీలు

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థినులు (డ్రాపవుట్స్), తల్లిదండ్రులకు దూరమైన అనాథ విద్యార్థినులకు అవి దేవాలయాలు.. విద్యార్థినులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించడం తోపాటు వారి సర్వతో అభివృద్ధికి అవి బాటలు వేస్తాయి... ఆ విద్యాలయాలే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) ఇందులో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది.

ఇంటర్ వరకు ఉచిత విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి... ఇందులో 6 నుంచి ఇంటర్ వరకు ప్రవేశం కల్పిస్తారు. ఆయా కేజీబీవీలో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విద్యాలయాల్లో విద్యార్థినులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యను అందిస్తారు. ఈ (2025-26) విద్యా సంవత్సరానికి గాను 6, 11తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

వీరికి ప్రాధాన్యం

అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు **https:apkgbv.apcfss.in** అనే ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు. సందేహాలకు 70751-59996, 70750-39990 నంబర్లలో సంప్రదించవచ్చు.

సాగర్ ఎయిర్‌పోర్టుకు.. భూసేకరణ



సాగర్ మినీ ఎయిర్‌పోర్టులో రన్‌పై ఉన్న శిక్షణ సంస్థకు చెందిన విమానం (ఫైల్‌ఫొటో)

నెరవేరనున్న పల్నాటి వాసుల కల



భూమి వివరాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరం లో నాగార్జున సాగర్ రిజర్వాయర్, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే బౌద్ధ మ్యూజియం, లాంచీ ప్రయాణం వంటి సదుపాయాలతో ఆకర్షిస్తోంది. దీనికి తోడు ఎయిర్‌పోర్టు నిర్మాణం మరింత దోహదపడనుంది. ఎంతో కాలం నుంచి పర్యాటకులు ఎదురుచూస్తున్న ఎయిర్‌బస్ త్వరలో నాగార్జున సాగర్ వద్ద దిగనుంది. ఇప్పటికే భూసేకరణ వేగవంతంగా సాగుతోంది.

నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో..

నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నిర్మాణం అనంతరం ప్రధాని ఇందిరాగాంధీ రాకపోకల కోసం 1955లో మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ దక్షిణ విజయపురి రైట్‌బ్యాంక్ వద్ద 120 ఎకరాల్లో చిన్న విమానాశ్రయాన్ని ఏర్పాటు చేశారు. తదుపరి రాకపోకలు లేక విమానాశ్రయం మూలనపడింది. 2010లో ఫ్లయిటెక్ అనే సంస్థకు కోచింగ్ నిర్వహించుకునేందుకు అనుమతులు లభించాయి. మినీ ఎయిర్‌పోర్టులో సింగిల్ ఇంజన్, రెండు సీట్ల విమానాలతో శిక్షణ పొందుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో విస్తరణ దిశగా...

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఏడు విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దీనిలో నాగార్జున సాగర్ ఎయిర్‌పోర్టుకు కూడా స్థానం దక్కడం విశేషం. ఎయిర్ పోర్టు నిర్మించాలంటే భూసేకరణ తప్పనిసరి. మినీ ఎయిర్‌పోర్టు సమీపంలోని బ్రహ్మానందపురంతండా, పశువేముల, నాగులవరం, చింతలతండా గ్రామాల్లోని రెవె న్యూ భూములు, అటవీశాఖ భూములు సుమారు 1670 ఎకరాలు సేకరించాల్సి ఉంది. కొనుగోలు చేయ కుండానే ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండడం విమానాశ్రయం ఏర్పాటుకు కలిసొచ్చిన అంశం. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ప్రత్యక్షంగా మినీ ఎయిర్‌పోర్టు పరిసరాలను పరిశీలించారు. త్వరలోనే రెవెన్యూ భూములతోపాటు అటవీశాఖకు సంబంధించిన 500 ఎకరాలు కూడా కావాల్సి ఉండడంతో ఆ దిశగా సర్వే నిర్వహిస్తున్నారు. త్వరలోనే భూ సేకరణ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.


పర్యాటకరంగానికి ఊతం..

ఎయిర్‌పోర్టు విస్తరణ జరిగితే పూర్తిస్థాయి విమానాశ్రయంగా రూపొంది విమానాల రాకపోకలు జరుగుతాయి. దీంతో నాగార్జున సాగర్, అనుపు, ఐల్యాండ్ మ్యూజియం, బుద్ధ పూర్ణిమ, ఎత్తిపోతల వంటి ఆకర్షణీయ ప్రదేశాలు పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండి స్పిల్‌వే ద్వారా దిగువ కృష్ణానదికి పరుగులు పెడుతున్నప్పుడు పర్యాటకులు సాగర్‌ను సందర్శించేందుకు అమితంగా ఇష్టపడుతుంటారు. బౌద్ధ క్షేత్రంగా బాసిల్లిన నాగార్జున సాగర్‌ను సందర్శించేందుకు టిబెట్, నేపాల్, శ్రీలంక, బూటాన్ దేశాలకు చెందిన బౌద్ధ బిక్షుల రాకపోకలకు అనువుగా ఉండనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పర్యాటకుల రాకపోకలకు, పల్నాడులో మొట్టమొదటి ఎయిర్‌పోర్టుగా స్థానం దక్కించుకోనుంది.

ఆకులన్నీ రాలిన చోటే... కొత్త చిగురు



ఆకులన్నీ రాలిన చోటే... కొత్త చిగురు కనిపిస్తుంది అని ఒక కవి రాసిన పాట ఇలాంటివి చూసినప్పుడే గుర్తుకొస్తుంది. వేసవికాలం వల్ల ఆకులన్నీ రాలి మోడు



బారిన కొమ్మలకు మూడు రోజుల అనంతరం కొత్త చిగురు వచ్చి ఆకుపచ్చగా గుంటూరులోని బ్రాడీపేటలో కనిపించిన చెట్టు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ఈ-క్రాప్‌లో నమోదు.. 230 మంది మాత్రమే

- యార్డులో అమ్మకందారులంతా రైతుల వద్ద కొనుగోలు చేసిన వాళ్లే
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ ఎంఐ స్కీమ్ అమలు అసాధ్యం
- దీనిని అవకాశంగా మార్చుకొంటున్న కొందరు వ్యాపారస్థులు



గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చికి కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద ప్రకటించిన కనీస మద్దతు ధరని ఇక్కడి రైతులు పొందలేని పరిస్థితి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో నెలకొన్నది. ఈ స్కీమ్ నిబంధనలలో కీలకమైన ఈ-క్రాప్ బుకింగ్‌లో రైతులు ఎవరూ తమ పంట సాగు, విస్తీర్ణాన్ని నమోదు చేసు కోవడం లేదు. ఏ కొద్దిమందో తప్పితే మిగతా రైతులంతా పట్టించుకోవడం లేదు. మరోవైపు రైతు లకు ముందుగానే పెట్టుబడి పెడుతున్న వ్యాపారస్తులు పంట చేతికొచ్చాక వేరే వాళ్ల పేర్లతో యా ర్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుండటంతో ఈ-క్రాప్ బుకింగ్‌లో ఆ వివరాలు కనిపించడం లేదు. ఈ ఏడా ది మిర్చి సీజన్ ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు యార్డులో జరిగిన అమ్మకాలకు సంబంధించిన వివరాలను మార్కెటింగ్ అధికారులు పరిశీలన చేయగా కేవలం 230 మందికి మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ జరిగివున్నట్లు తేలింది. దీంతో వాళ్లకు మాత్రమే ఎంఎస్‌పీని అమలు చేసే పరిస్థితి ఉన్నది.

మిర్చియార్డులో ఈ సంవత్సరం వింత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు కారణం సీజన్ ప్రారంభయ్యేనాటికి కోల్డ్‌స్టోరేజ్‌లలో 50 లక్షల టిక్కీలు(ఒక్కోటి 45 కేజీలు) వరకు నిల్వ ఉన్నాయి. దీని వలన వాటిని రైతులు యార్డుకు తీసుకురావడం, మరోవైపు కొత్త పంట రావడంతో మార్కెట్‌లో ధర పెరగలేదు. క్వింటాల్ రూ. 10 వేల మధ్యనే కొనసాగింది. సంక్రాంతి పండగ తర్వాత కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు 20 లక్షల టిక్కీలకు తగ్గిపోవడంతో, అదే సమయంలో ఎగుమతులు ప్రారంభం కావడంతో ధరలో కాస్త పెరుగుదల కనిపించింది. క్వింటాల్ రూ. 11 వేల నుంచి రూ. 13 వేల మధ్యన కొనసాగింది. ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మిర్చికి కనీస మద్దతు ధరని రూ. 11,781గా నిర్ణయించింది. దీంతో మార్కెట్ ఊపందుకొంటుందని అంతా భావించారు. అయితే ఈ స్కీమ్ ద్వారా లబ్ధి పొందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి కావడంతో ఏ కొద్దిమంది రైతులకు మాత్రమే అక్కరకు వచ్చే పరిస్థితి తలెత్తింది.

నిత్యం లక్షా 20 వేల టిక్కీల విక్రయం మిర్చియార్డులో జరుగుతున్నది. రోజుకు కనీసం 1500 నుంచి 2 వేల మంది రైతులు రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా సరుకు తీసుకొస్తున్నారు. ఈ కారణంగా ఎవ్వరి పేర్లు ఈ-క్రాప్ బుకింగ్‌లో మ్యాచింగ్ కావడం లేదు. ఈ సీజన్‌లో కనీసం లక్ష మంది రైతులు తమ మిర్చిని విక్రయించి ఉంటారని అంచనా. అయితే వారిలో కేవలం 230 మంది పేర్లు మాత్రమే ఈ-క్రాప్‌లో నరితూగడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొంతమంది వ్యాపారస్థులు ధర పెరగకుండా అడ్డుకొంటున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. రైతుల మిర్చికి ప్రభుత్వం ఎంఎస్‌పీ చెల్లించలేదు కాబట్టి తేమ శాతం అధికంగా ఉందని, తాలు ఎక్కువగా ఉందని, సైజులు లేవని పేర్కొంటూ ధర కోత పెడుతున్నారు. ఈ కారణంగానే క్వింటాల్ మిర్చి నేడు మార్కెట్‌లో రూ. 7 వేల నుంచి రూ. 9 వేల మధ్యనే ఉన్నది. యార్డుకు వచ్చే సరుకులో 85 శాతం ఈ కోవలోనే ఉంటున్నాయి. కేవలం 10 నుంచి 15 శాతం మిరపకాయలు మాత్రమే నాణ్యతగా ఉన్నాయని వాటికి అధిక ధర చెల్లిస్తున్నారు.

చెన్నకేశవుని భూములు హాంఫట్

- వేల ఎకరాలు అన్యాక్రాంతం
- దాతల సహకారంతో ఉత్సవాలు
- విలువైన భూములు ప్లాట్లుగా వేసి వ్యాపారం



శ్రీ చెన్నకేశవ స్వామి మూల విరాట్



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

మాచర్లటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 13వ శతాబ్దంలో పల్నాటి బ్రహ్మనాయుడు చేత పునర్నిర్మితమై పల్నాటి ప్రజల ఇలవేల్పుగా బాసిల్లిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయ వేలాది ఎకరాల భూములు కాలక్రమంలో కరిగిపోయాయి. విలువైన భూములు పరాధీనమైపోయాయి. మాచర్ల అనగానే గుర్తుకొచ్చే చెన్నకేశవస్వామి ఆలయం పూర్వకాలం నాటి భూస్వాములు, భక్తులు సమర్పించిన భూములు నేడు కబ్జాకు గురై అన్యాక్రాంతమైపోయాయి. ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడంతో ఆలయ నిర్వహణ దాతల సహకారంతో నడవాల్సిన దుస్థితి నెలకొంది...

సంపన్న చెన్నకేశవుడు..

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంకు సుమారు 3 వేల ఎకరాలు దాతల ద్వారా సంక్రమించింది. ఆలయ ధూపదీప నైవేద్యాల కొరకు పూర్వీకులు ఆలయానికి ఆ భూములు అప్పగించారు. ఆ భూముల కౌలు ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహించే వారు. నిత్య అన్నదానం నిర్వహించడం కూడా జరిగేది. కాలక్రమంలో 3 వేల ఎకరాలు పరాధీనమై సుమారు 30 ఎకరాలు స్థితికి చేరుకుంది. జమ్మలమడక అగ్రహారం కింద 1200 ఎకరాలు ఉండేది. 1948 ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ద్వారా కౌలుకు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అలాగే 1956లో కన్వర్షనల్‌ఆఫ్ ఈనామ్ యాక్టు ద్వారా ప్రభుత్వం మరో 250 ఎకరాలను పంపిణీ చేసింది. దీంతో సుమారు 1500 ఎకరాల భూమి ఆదాయం కోల్పోయింది.



రియల్ ఎస్టేట్‌గా మారిన ప్లాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అన్యాక్రాంతమైన విలువైన భూములు

మాచర్ల పట్టణంలో అత్యంత విలువైన చెన్నకేశవస్వామి భూములు అన్యాక్రాంతమయ్యాయి. నరసరావుపేట రోడ్డులో రహదారికి ఇరువైపులా ఎకరం రూ. 5 కోట్లు విలువ చేసే భూములు ఆక్రమించుకున్నారు. ఈ భూములు అప్పట్లో ఆలయంలో పనిచేసే మేళగాళ్ల, మోతబోయలు, నాయీ బ్రాహ్మణులు, కళావంతులు, వెట్టి, వడ్రంగి, కంసలి, రజక, భత్రాజులు సాగు చేసుకొని స్వామి వారికి సేవ చేసేందుకు అప్పగించిన భూములు అవి. చాకిరి మాన్యాలుగా ఉన్న భూములను ఆయా వర్గాల ప్రజలు నుంచి పలుకబడి ఉన్న నేతలు కాజేశారు.

రియల్ ఎస్టేట్‌గా మార్చి ప్లాట్లు పెట్టి విక్రయాలు..

నరసరావుపేట రోడ్డులో బడుగు, బలహీన వర్గాల నివాస స్థలాల కోసం 20 ఏళ్ల క్రితం 15 ఎకరాలు భూమి నామినల్ రేటుకు దేవాదాయ శాఖ విక్రయించింది. దాన్ని అదునుగా చేసుకొని ఆనుకొని ఉన్న మరో 5 ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీనికితోడు ఎర్ర రాయి క్వారీలకు 20 ఎకరాల పైచిలుకు పనికి రాకుండా పోయింది. క్వారీ గుంతలను కూడా పూడ్చి భూకబ్జాదారులు అమ్మేసుకున్నారు. ప్రస్తుతం చెన్నకేశవ నగర్, బైపాస్ రోడ్డుకు మధ్యలో ఉన్న 12 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్‌గా మార్చి ప్లాట్లు పెట్టి క్రయ విక్రయాలు జరుపుతున్నారు.

దాతల సహకారంతో ఉత్సవాలు..

వేలాది ఎకరాలు కలిగి సంపన్నునిగా ఉన్న చెన్నకేశవ స్వామి దశాబ్దాల తరువాత ఆ భూములు కోల్పోయి ఆదాయం లేక దాతలు సహకారంతో ఉత్సవాలు జరుపుకునే స్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో రోజుకో వాహనంపై ఊరేగించి రథోత్సవాలు జరుపుకుంటారు. స్వామి వారి హుండీ ద్వారా వచ్చే ఆదాయం, దాతలు ఇచ్చే చందాలతో అరకొర ఖర్చులతో ఉత్సవాలు జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

16బై2013 చట్టం అమలు పరిస్తేనే...

చెన్నకేశవస్వామికి చెందిన అన్యాక్రాంతమైన చాకిరి మాన్యాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే 16బై2013 చట్టం అమలుపరచాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం సర్వీసు ఈనాం భూములన్నీ తిరిగి ఆ దేవాలయానికే దక్కుతాయి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడకపోవడంతో యాక్టు అమలు జరగడం లేదు. అన్యాక్రాంతం అవుతున్న భూములపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆక్రమణకు గురవుతున్న భూములను కాపాడుకునేందుకు దేవాదాయ శాఖ అధికారులు చొరవ చూపకపోవడం కూడా ఆలయానికి గ్రహణంగా మారింది. రీ సర్వే జరిపి చెన్నకేశవుని భూములను తిరిగి దక్కించుకుంటే కోట్ల రూపాయలు విలువైన ఆస్తులు స్వామి వారికి దక్కనున్నాయి. ప్రభుత్వం స్పందించి చెన్నకేశవస్వామి భూములను తిరిగి రప్పించగలిగితే స్వామి వారికి పూర్వవైభవం సంతరించుకోనుంది.

జేకేసీ కళాశాలలో ఫుడ్ కోర్ట్



ఫుడ్ కోర్టును ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్

పసందుగా వంటకాలు

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని జేకేసీ కళాశాలలో బుధవారం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేశారు విద్యార్థినీ విద్యార్థుల ఆధ్వర్యంలో తయారుచేసిన పసందైన వంటకాలు ఆహార ప్రియుల్ని ఆకట్టుకున్నాయి. వివిధ రకాల కూరలు, బిర్యాని, రైస్ ఐటమ్స్, చికెన్, కూరగాయలతో చేసిన ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. మొత్తం 150 పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫుట్ కోర్టును కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ప్రారంభించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ కే సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకురాలు నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్ట్

నేడు ఆరోగ్యమిత్రల నిరసన

మంగళగిరి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మంగళగిరిలోని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కార్యాలయం వద్ద నిరసనకు ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలని రెండు వారాల నుంచి నిరసన తెలియజేసి, అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో గురువారం ఉదయం మరోమారు శాంతియుత నిరసన చేపట్టనున్నట్టు యూనియన్ నేతలు తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవాపథకంలో పని చేస్తున్న ఆరోగ్యమిత్ర ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు నృసింహుడి హుండీల లెక్కింపు

మంగళగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం ఉదయం లెక్కించనున్నట్టు దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు. ఎగువ, దిగువ సన్నిధులతోపాటు ఉపాలయమైన శ్రీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీలను లెక్కిస్తామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు, ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు క్రెడిట్ క్యాంపు

తాడికొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలను అందజేస్తుంది. దానికి సంబంధించిన బీసీ యాక్షన్ ప్లాన్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈనెల 28వ తేదీన తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే సమతావాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రెడిట్ క్యాంపుకు ఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకావాలని కోరారు. క్రెడిట్ క్యాంపునకు వచ్చే వారు దరఖాస్తు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలను తీసుకురావాలని కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉపాధి కల్పన

తాడికొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీ.వీ. విజయలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో పేరు నమోదు చేసుకొనుటకు క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగులు ఎస్ఈఈడీఏపీ సంస్థ క్యూర్ కోడ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వార్ స్కిల్ నేర్చుకున్నవారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జాబ్స్ జిల్లా మేనేజర్ డీ లక్ష్మీదేవి, ఎంపీడీవో సమతావాణి, ఏపీఎం ఆర్ సాంబశివరావు, సూపరిండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై డ్రోన్ నిఘా

మంగళగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై డ్రోన్ సాయంతో నిరంతర నిఘా ఉంచుతున్నట్టు మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. కాజ గ్రామ శివారులోని డొంక ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం డ్రోన్ గస్తీ నిర్వహించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే ఉపేక్షిం చేదిలేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైలేరియా బాధితులకు కిట్ల పంపిణీ

తాడేపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పైలేరియా బాధితులకు పట్టణ పీహెచ్‌సీలో బుధవారం కిట్లు అందజేశారు. ఈ కిట్లలో ఒక టబ్, మగ్గు, సోపు, టవల్, ఆయింట్‌మెంట్, అందజేశారు. దోమకాటు వల్ల పైలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని నిల్వ నీరు లేకుండా ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కువ కాలం నీటిని నిల్వ చేస్తే ఆ నీరు పారబోయాలని లేని పక్షంలో దోమల లార్వా వ్యాప్తి చెంది ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనూష, సీహెచ్‌వో గురుమోహనరావు, ఎస్‌పీవో సుధీర్‌కుమార్, సూపర్‌వైజర్ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టులు భర్తీచేయాలి

● కొల్లా సీతారామయ్య

పెదనందిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని సుభిక్షా సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కొల్లా సీతారామయ్య బుధవారం ఓప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు కమిటీలు వేయడం వల్ల వ్యవసాయ అవసరాలకు దోహదపడుతుందని, కమిటీ ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు ఎంతో నష్టపోతున్నారని, అంతేకాకుండా పొలాలకు వెళ్లే డొంకలు, రోడ్డు అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. గతంలో కమిటీలు వేసి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశారని తెలిపారు.

3న విజయవాడలో రైతు సదస్సు

గుంటూరు(తూర్పు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేక నల్లచట్టాల కంటే మరింత ప్రమాదకర చట్టాలను తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 3న విజయవాడ, హనుమంతరాయ గ్రంథాలయంతో రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వ హిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు హాజరవుతారని తెలిపారు.

రాజధాని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

● ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచటానికి చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



వర్క్‌షాప్‌లో సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం తుళ్లూరు హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో సీఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, టెక్నికల్ సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో రాజధాని నగర గ్రామాల స్ట్రాటజీ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. రాజధాని గ్రామాల్లో సభలు నిర్వహించి, ప్రజల అవసరాలు గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించే విధానాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై పబ్లిక్ హెల్త్ ఏఈ నగేశ్ వివరించారు. వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పలు సూచనలు చేశారు. డ్రైనేజ్ వ్యవస్థ అత్యంత మెరుగైనదిగా.. అంటే మెగా సిటీ స్థాయిలో ఉండేవిధంగా రాజధాని గ్రామాల్లో అమలు చేయాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అమరావతి నగర గ్రామాలు కాబట్టి మెరుగైన వసతుల కల్పనకు డీపీఆర్‌లు తయారు చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన రైతులు రైతు కూలీలు, సీఆర్డీఏ అధికారుల సమావేశంలో ప్రజలు పలు సమస్యలను తెలిపారని గుర్తు చేశారు. వాటిని పరిగణలోకి తీసుకుంటే మెరుగైన వసతుల ఏమిటనేది తెలుస్తుందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ, ముస్లిం మైనార్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టి మెరుగ్గా చేయాలన్నారు. తద్వారా రాజధాని నగర గ్రామాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామసభలు నిర్వహించి సమస్యలు తెలుసుకొని వాటి ఆధారంగా డీపీఆర్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాస యాదవ్, శ్రీరాంమూర్తి పబ్లిక్ హెల్త్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగేశ్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం ఏఈలు, డీఈలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల ఎంపీడీవోలు, రాజధాని 29 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ - రేవేంద్రపాడు రహదారి నిర్మాణాన్ని చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు



మెల్లెంపూడి వద్ద స్థానికులు, ప్రజాసంఘాల నేతలతో మాట్లాడుతున్న సీపీఎం నేత మధు

తాడేపల్లి(మెల్లెంపూడి), మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేఎల్‌యూ - రేవేంద్రపాడు పీడబ్ల్యూడీ రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. తాడేపల్లి మండలం మెల్లెంపూడి వద్ద బుధవారం స్థానికులు, ప్రజాసంఘాల నేతలతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. సమస్య పరిష్కారం చేయని పక్షంలో కేఎల్‌యూ రోడ్డు బ్లాక్ చేసి తాడేపల్లి ప్రాంతంలో బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. తాడేపల్లి మండల విలీన గ్రామాల్లో మురుగు సమస్యను పరిష్కరించే విధంగా మంత్రి చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, కంచర్ల సాంబశివరావు, విజయరాజు, కొట్టే కరుణాకర్, జేమ్సు నీరుడు దుర్గారావు, ఎంఎల్ నరసింహారావు, సుధాకర్, స్థానికులు ఆళ్ల వెంకటప్పారెడ్డి, సాంబి రెడ్డి తదదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల యాదవపాలెంలో, మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీకోదండరామచంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని టీడీపీ నాయకులు లోకేశ్‌ను బుధవారం ఆహ్వానించారు. టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు నేతృత్వంలో ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్ గృహంలో కలిసి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. మే 8న ఉదయం జరుగనున్న ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం పలికిన వారిలో దుగ్గిరాల టీడీపీ నాయకులు, యాదవ సామాజిక వర్గీయులున్నారు. **(దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)**

దోపిడీ లేని సమాజం కోసం పాటుపడిన ధర్మభిక్షం

● జంగాల అజయ్‌కుమార్



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

తాడేపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దోపిడీ లేని సమాజం కోసం స్వర్గీయ బొమ్మగాని ధర్మభిక్షం పాటుపడ్డారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ నేత ధర్మభిక్షం 14వ వర్ధంతిని పురస్కరించుకుని తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో రాష్ట్ర గీత పనివారల సంఘం నాయకులు కంచర్ల కాశయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. తొలుత నేతలు కార్యకర్తలు ప్రజాసంఘాల నేతలు ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మభిక్షం కల్లుగీత పనివాళ్ల కోసం సామాజిక పోరాటం నడిపారన్నారు. 75వేల ఓట్ల మెజారిటీతో ఆనాడు పార్లమెంట్ సభ్యుడిగా సీపీఐ తర పున గెలుపొందారన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామ్‌గోపాల్‌గౌడ్ మాట్లాడుతూ ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటి కన్వీనర్ మున్నూరు భాస్కరయ్య, సీపీఐ నేతలు చిన్ని తిరుపతయ్య, వేముల వెంకటాచలం, వాకా రామ్‌గోపాల్‌గౌడ్, టిఎన్నార్ మాస్టారు, పలగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుగ్గిరాల ఎంపీపీ ఎన్నిక



షేక్ జబీన్

దుగ్గిరాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ అధ్యక్ష ఎన్నిక గురువారం నిర్వహించనున్నారు. చిలువూరు ఎంపీటీసీ సభ్యురాలు, ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 సెప్టెంబరులో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పది స్థానాలు, జనసేన ఒకస్థానం, వైసీపీ ఏడుస్థానాలు గెలుచుకున్నాయి. ఎంపీపీ టీడీపీ అభ్యర్థిగా ఉన్న చిలువూరు ఎంపీటీసీకి అప్పటి తహసీల్దార్ బీసీ ధ్రువీకరణపత్రం జారీ చేయకపోవడంతో సెప్టెంబరు 25న ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించినప్పటికీ కోరం లేక నిలిచిపోయింది. కుటుంసభ్యులందరికీ బీసీ ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా రాజకీయ కారణాలతో బీసీ ధ్రువీకరణపత్రం ఇవ్వడం లేదని, ఒక మైనార్టీ మహిళను ఎంపీపీ కానివ్వకుండా అడ్డుకుంటున్నారని, తహసీల్దార్ కార్యాలయం ఎదుట, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోయింది. తిరిగి 2022 మే 5న జరిగిన ఎంపీపీ ఎన్నిక జరిపినప్పటికీ టీడీపీకి మరో బీసీ అభ్యర్థి లేకపోవడంతో సంఖ్యా బలం లేనప్పటికీ వైసీపీకి చెందిన ఎంపీటీసీని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఎంపీపీ రాజీనామా చేశారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీపీగా షేక్ జబీన్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉప ఎంపీపీగా ఈమని ఎంపీటీసీ పసుపులేటి సాయిచైతన్య కొనసాగుతున్నారు. కాగా ఇటీవల జబీన్‌కు, బీసీ ధ్రువీకరణ పత్రం అందించడంతో ఎంపీపీ ఎన్నికకు మార్గం సుగమమైంది. వారం క్రితం ఎంపీపీ ఎన్నికను నిర్వహించాలంటూ ఈనెల 21న మండలపరిషత్ కార్యాలయానికి జీవో విడుదల చేసిన నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో, గురువారం ఉదయం 11గంటలకు ఎన్నికల ప్రక్రియను ప్రారంభిచనున్నారని తెలిపారు.

వీవోఏలలో గందరగోళం

● కొందరిపై డ్వాక్రా మహిళల ఫిర్యాదు
● అవినీతిలో గత అధికారులకు భాగస్వామ్యం
● పోలీస్ కేసుతో అందరిలో భయాందోళన

ప్రత్తిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు వెలుగులో భయం మొదలైంది. ఇప్పటి వరకు అవినీతి కూపంలో లక్షలాది రూపాయలు మేసిన వీవోఏలకు వారికి సహకరించి అందులో బాగస్వాములైన అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మండల సమాఖ్య కార్యాలయంలో సీసీ చేతి వాటం ప్రదర్శించి సుమారు ఎనిమిది లక్షల రూపాయలు కాజేసినా ఇంత వరకు కేసు నమోదు కాలేదు. అలాగే వీవోఏల భాగస్వామ్యంతో ఓ సీసీ డ్వాక్రా గ్రూపులలోని సొమ్ము కాజేసి ఎంచక్కా తమ ఖాతాలో వేసుకున్నట్టు నిరూపణ అయినా కేసు నమోదు చేయలేదు. ఇప్పటి వరకు గొట్టిపాడులో ఒక వీవోఏ అవినీతికి పాల్పడి లక్షలాది రూపాయలు కాజేసిందంటూ పక్కా ఆధారాలతో జిల్లా ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదుతో పాటు రోడ్డెక్కి గొంతు పోయేలా అరిచినా ఫలితం లేకుండా పోయింది. అయితే ప్రత్తిపాడు ఏపీఎం లాజరు పదిహేను రోజుల క్రితం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వీవోఏలపై పెట్టిన కేసును ప్రత్తిపాడు పోలీసులు రిజిస్టర్ చేయడంతో అందరిలోనూ చలనం మొదలైంది. వీవోఏల అవినీతిలో ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీసీలు, ఏపీఎంల పాత్ర కూడా ఉంటున్నదనేది బహిరంగ రహస్యం. తాము తీసుకునే ప్రతి రూపాయిలో అధికారులకు వాటా ఇవ్వాల్సిందేనని, లేదంటే డ్వాక్రా సంఘాలకు లోన్లు అయ్యే పరిస్థితి ఉండదనేని కొందరు వీవోఏలు చెపుతున్నారు.

గత అధికారులకు టెన్షన్

ప్రతి గ్రూపు నుంచి రికార్డు తయారు చేసేందుకు ప్రత్తిపాడు పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో గతంలో వీవోఏల ప్రోద్బలంతో లోపాయకరంగా సీసీలకు డ్వాక్రా సంఘాల నుంచి డబ్బులు ఇప్పించినవి, స్త్రీనిధి లోన్లు మహిళలకు ఇవ్వకుండా వారి వద్ద నుంచి సీసీలు తీసుకున్న విషయాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. స్త్రీనిధి సొమ్మును తమ సొంత అవసరాలకు వాడు కున్నామంటూ కొందరు వీవోఏలు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ఈ క్రమంలో ఎవరిపై ఏ పిడుగు పడుతుందో నని అధికారులు భయపడుతున్నారు.

పరీక్షల వేళ పెరిగిన కోతలు

● విద్యుత్ సరఫరాలో అంతరాయాలు
● గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వైనం
● పరికరాల కొరత అంటున్న సిబ్బంది



గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్‌లోని పలు సెక్షన్‌లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరిగాయి. ఇక బాపట్ల సర్కిల్ పరిధిలోని బాపట్ల డివిజన్‌లో కర్లపాలెంలోని నందిరాజుతోట, యాజలి, నల్లమోతువారిపాలెం, కంకటపాలెం, పీవీపాలెం, అమృతలూరు, వేమూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉంటున్నట్లు సమాచారం. ఇక పల్నాడు జిల్లా సర్కిల్ పరి ధిలోనూ రాజుపాలెం, నాదెండ్ల, దుర్గి, కారం పూడి ఆయా ప్రాంతాల సెక్షన్‌ల పరిధిలో కూడా విద్యుత్ అంతరాయాలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. రాజుపాలెం మండలం ఇనుమెట్ల గ్రామంలో అయితే కొన్ని సార్లు పగలంతా విద్యుత్ సరఫరా ఉండని పరిస్థితులు నెలకొన్నాయి. సాంకేతిక కారణాలని అధికారులు పైకి చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ వైఫల్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌ల పరిధిలో విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) పేరుతో రోజుల తరబడి పనులు చేస్తుండటం కూడా ప్రజల్లో అసహనం కలిగిస్తోంది. ప్రతి నెలలో రెండో శనివారం విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉదయం నుంచి మధ్యాహ్నం, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాధారణ రోజుల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతోన్న వేసవితో గుంటూరు సర్కిల్ పరిధిలోని ఐదు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌లో దాదాపు 15 మిలియన్ యూనిట్లపైనే విద్యుత్ వినియోగం జరుగుతుంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ఉన్నప్పటికీ సరఫరాలో అంతరాయాలు అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

స్టోర్స్‌లో పరికరాల్లేవంటూ విమర్శలు..

విద్యుత్ లైన్‌లకు సంబంధించి 11 కేవీ తీగెలు, స్విచ్‌లు, ఎర్త్‌వైర్లు, కండక్టర్‌లు, కేబుల్స్ వంటివి సెక్షన్ కార్యాలయాల పరిధిలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సెక్షన్‌ల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకున్న వారే లేదని సిబ్బంది వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ పాపం ఇప్పుడు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్లలో ఒకరు మాత్రమే లైన్‌మెన్ ఉండటం కూడా విద్యుత్ అంతరాయాలకు కారణాలుగా చెబుతున్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు

ఫిరంగిపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా క్షయవ్యాధికి సంబంధించి మెరుగైన సేవలు అందించిన మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఎస్ కొండపల్లి సుదర్శన రాజు, స్టాఫ్‌నర్సు టీ పల్లవి, పీ నారాయణరెడ్డికి జిల్లా అధికారులు ప్రశంసాపత్రాలు అందజేశారు. పత్రాలను వైద్యాధికారి యానిగ్రేస్ బుధవారం వైద్యసిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫరీనా బేగం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ప్రగతికి క్రమశిక్షణ అవసరం

● ఎంఈవో కెన్నడీ



వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్న ఎంఈవో కెన్నడీ, తదితరులు

కాకుమాను, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రగతి పథంలో పయనించాలంటే క్రమశిక్షణ అవసరమని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరు ఎంపీపీ పాఠశాలను వార్షిక తనిఖీ చేశారు. విద్యార్థులు హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు తదితర అంశాల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి బయట విద్యార్థులను గుర్తించి వారు తిరిగి పాఠశాలలో జరిగే తరగతులకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫార్మర్ రిజిస్ట్రేషన్' తప్పనిసరి : ఏవో

కాకుమాను, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులకు సంక్షేమ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి తెలిపారు. బుధవారం రైతులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఏవో కిరణ్మయి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ వంటి పథకాలు రైతులకు అందాలంటే ఫార్మర్ రిజిష్ట్రేషన్ ప్రతి రైతు చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో మానసిక స్థితిగతులపై సదస్సు

గుంటూరు(విద్య), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆధునిక యువత మానసిక స్థితిగతులపై ఈనెల 28, 29వ తేదీల్లో సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.స్వరూపరాణి తెలిపారు. సాంబశివ పేటలోని కళాశాలలో బుధవారం సదస్సు బ్రోచర్, ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు.

త్వరలోనే వైసీపీ ఖాళీ

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



ఎంపీటీసీ భూలక్ష్మీకి టీడీపీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు(తూర్పు), మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కూటమి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు, వైసీపీ నాయకులు ఆకర్షితులవుతున్నారని, త్వరలోనే వైసీపీ ఖాళీ అవబోతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. వైసీపీకి చెందిన గుంటూరు రూరల్ మండలం, వెంగళాయపాలెం-2 ఎంపీటీసీ ఉడత భూలక్ష్మి, బీసీ నాయకుడు రాంబాబు టీడీపీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో ఆయన వారికి టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ అసమర్ధ అస్తవ్యస్త పాలన వల్ల ప్రజలు విసిగి వేసారి పోయారని, అందుకే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. రాబోయే రోజుల్లో వైసీపీ కార్యాలయాలకు జగన్ టూలెట్ బోర్డులు పెట్టుకోక తప్పదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి లీలా మల్లేశ్వరరావు, కర్లపూడి శ్రీనివాసరావు, దీనరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో సత్వరమే సమస్యలు పరిష్కారం

తాడికొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి గ్రీవెన్స్ ద్వారా అర్జీలను స్వీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్‌ను ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలు ఉంటే ఆయా తహసీల్దార్లతో మాట్లాడి సమస్యలు పరిష్కారించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే నిర్వహించిన గ్రీవెన్స్‌లో 50వరకు అర్జీలు వచ్చాయి.

బకాయిలను వెంటనే చెల్లించాలి

డిప్యూటీ సీఈవో కృష్ణ



నిర్వాహకులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో కృష్ణ

పెదనందిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ కాంప్లెక్స్ దుకాణాల పెండింగ్ అద్దె బకాయిలను నెలాఖరులోపు చెల్లించాలని డిప్యూటీ సీఈవో కృష్ణ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ కాంప్లెక్స్‌ను బుధవారం పరిశీలించారు. 16 షాపులకు గాను 8.09లక్షలు బకాయిలు పెండింగ్‌లో ఉండగా 1.60లక్షలు వసూలు చేశారని, మిగిలిన బకాయిలు కూడా యజమానులు పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. కాంప్లెక్స్ ఎదుట సైడు కాలువలు పగులగొట్టి నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, నిర్మాణాలు చేపట్టి, నీటికుళాయి సదుపాయం కల్పించాలని షాపుల యజమానులు డిప్యూటీ సీఈవోను కోరారు. దీనిపై స్పందించి నిర్మాణం కోసం 3.20లక్షలు నిధులు మంజూరు చేశారని, కుళాయిలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో, కార్యదర్శి ఉన్నారు.

వాహనదారులకు జీపీఎస్ ట్రాకర్‌తో భద్రత

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు భద్రత కోసం తమ కారుకు, బైక్‌కు జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేసుకోవడం వల్ల అనుమానాస్పదంగా కదిలినప్పుడు అలెర్ట్ వస్తుందని ప్రమాదవశాత్తూ వాహనం చోరీకి గురైతే జీపీఎస్ ట్రాకర్ ద్వారా బండి ఎక్కడ ఉందో గుర్తించవచ్చని కేఎల్‌యూ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. బుధవారం వడ్డేశ్వరంలో కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ సీఎస్ఈ ఆనర్స్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి తిరిగి జీపీఎస్ ట్రాకర్‌పై అవగాహన కల్పించారు. వాహనాల భద్రత పెరుగుందని ఇంధనపొదుపు నష్టాల నివారణ, డ్రైవింగ్ నైపుణ్యం మెరుగుపడుతుందని ఈ పరికరం రూ.800ల నుంచి మొదలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, సమన్వయకర్త సురేష్ వలంటీర్లు సీఎస్ఈ ఆనర్స్ విభాగాధిపతి సెంత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్థాన అలంకారంలో కాళీయ మర్దనం



కాళీయ మర్దనం అలంకారంలో నృసింహస్వామి

మంగళగిరి సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం కాళీయ మర్దనం ఘట్టాన్ని ప్రదర్శించారు. దిగువ సన్నిధిలోని శ్రీకృష్ణదేవరాయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన ఈ అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. విజయవాడకు చెందిన చిరుగుపాటి నరేష్ కైంకర్యపరులు గాను, మంగళగిరికి చెందిన మురళీధరన్ ఆస్థాన కైంకర్యపరులుగాను వ్యవహరించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామ కోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

113వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం తాడేపల్లి ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 113వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో శివకుమారి, సారమ్మ, దుర్గాభవాని, మల్లేశ్వరి, రమాదేవి కూర్చు న్నారు. దీక్షలను యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, క్రొత్రపాటి ఆది నారాయణ ప్రారంభించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, ఇస్మాయిల్, బాషా, సుబ్బారావు, హగ్గయ్య, హిమాంబి, బుజ్జి, రిబ్కా, రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు వాటర్ ఫిల్టర్స్ వితరణ

తెనాలి అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచుపేట శబరి వృద్ధాశ్రమం, వేల్పూరి అమ్మ వృద్ధాశ్రమాలకు బుధవారం వాటర్‌ఫిల్టర్లను వితరణగా ఇచ్చారు. మానవత సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీటిని ఇచ్చారు. చైర్మన్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ, వృద్ధులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే ఫిల్టర్లను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంచంద్, వెంకట్‌లను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సోమయ్యశాస్త్రి, దాసు, నాగేశ్వరరావు, అర్జున తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అనధికార ఫ్లెక్సీలను తొలగించండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటుచేసిన అనధికార ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం కమిషనర్ శేషన్న మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ వారి ఆదేశాలతో పురపాలక సంఘ పరిధిలో పురపాలక సంఘం వారి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన వ్యాపార, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీలు, అనధికార ఫ్లెక్సీలను మూడు రోజులలోపు స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. ఈ ఫ్లెక్సీలు బ్యానర్లు ప్రజలకు, ట్రాఫిక్‌కు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయన్నారు. అనధికార ఫ్లెక్సీలను తొలగించకుంటే పురపాలక సంఘం చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ శేషన్న హెచ్చరించారు.

ప్రారంభమైన సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వారంలో మూడురోజులు నిర్వహిస్తున్న సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. వివిధ విభాగాల్లో సర్టిఫికెట్లు పొందినవారు దాదాపుగా వందమంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వైకల్యశాతాన్ని ఆన్‌లైన్ ద్వారా నమోదుచేశారు. గురు, శుక్రవారాల్లో కూడా క్యాంపు జరుగుతుందని ఆసుపత్రి వర్గాలు తెలిపారు.



గోవర్ధనస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహం

గోవర్ధనస్వామి ఆలయంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు

తెనాలి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నెహ్రూరోడ్డులోని గోవర్ధనస్వామి ఆలయంలో బుధవారం శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆలయ ఆధునికీకరణలో భాగంగా ఆయన విగ్రహాన్ని, శిలాశాసనాన్ని ఏర్పాటుచేశారు. 1511 సంవత్సరంలో రాయలవారు ఈ ఆలయాన్ని దర్శించినట్లు శాసనంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు రఘు, మాధవ, ఈవో మల్లేశ్వరి పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక

తెనాలి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల ప్రజాపరిషత్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏవో ఆచంట శ్రీనివాసరావుతో కలిసి వివరాలు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయానికి ఒక కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరగనున్నట్లు చెప్పారు. ఎన్నికలలో పోటీ చేసేవారు మైనార్టీ అభ్యర్థులై, మండలానికి చెందినవారై, ఓటు కలిగి ఉండాలన్నారు. పోటీచేసేందుకు ఆసక్తికలిగిన అభ్యర్థులు ఉదయం 10గంటల నుంచి 12 గంటలలోపు ఓటు కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. అనంతరం పరిశీలన జరిపి అర్హుల వివరాలు తెలియజేస్తామన్నారు. మధ్యాహ్నం 1గంట నుంచి ఉపసంహరణ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తదుపరి అభ్యర్థులకు ఎన్నిక జరుగుతుందని సాయంత్రానికి కో-ఆప్షన్ సభ్యుడిని ఎన్నుకోవడం పూర్తవుతుందని ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో సాయికృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల ప్రకారం ఉపాధిహామీ కూలీలకు వేతనం: ఏపీవో వెంకయ్య

కొల్లిపర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలీలకు కొలతల ప్రకారం వేతనం ఇవ్వడం జరుగుతుందని ఏపీవో వెంకయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దంతలూరు, అత్తోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల కూలీలు సమయపాలనను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి. రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పిడపర్రు లాకు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆందోళనలో రైతన్నలు
- పిడపర్రు లాకుకు నూరేళ్లు



పూర్తిగా పాడైపోయిన తలుపులు

కొల్లిపర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కొల్లిపర సమీపంలో బ్రిటీష్ పాలకులు నిర్మాణం చేపట్టిన పిడపర్రు లాకుకు నూరేళ్లు నిండాయి. రాకపోకలకు, రైతులు తమ పంటల సాగు నిమిత్తం వంద సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టిన లాకులు పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు కూలిపోతాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. డెల్టా ప్రాంతమైనా కొల్లిపర సమీపంలో పిడపర్రు వద్ద రేపల్లె కుడి కాల్వపై నిర్మాణం చేపట్టిన లాకులు శిథిలావస్థకు చేరాయి. నిర్మాణం చేపట్టి వంద సంవత్సరాలు పైబడినప్పటికి వేలాది ఎకరాలకు సాగునీరు అందించటమే కాక రైతులు పండించిన పంటలను తమ గృహాలకు చేర్చుకోవడానికి ఉపయోగపడింది. శతాబ్దికాలం నుంచి లాకులు పని చేయడంతో గోడలు నెర్రెలు ఇవ్వడంతో పాటు అడుగుభాగాన చువ్వలు కూడ బయటపడ్డాయి. లాకు ఏర్పాటు చేసిన తలుపులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. లాకులకు వెనుకభాగాన ఏర్పాటుచేసిన గేట్లు కూడా శిథిలమయ్యాయి. దీంతో పిడపర్రు లాకు ఎప్పుడు కూలిపోతుందేమోనని రైతులు భయపడుతున్నారు. పిడపర్రు వద్ద నిర్మాణం చేపట్టిన లాకు శిథిలావస్థకు చేరుకున్నదని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ లాకులు కూలిపోతే వేలాది ఎకరాల్లో సేద్యం ఆగి పోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లాకు శిథిలమవటంతో ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్తగా దానిపై రాకపోకలను నిలిపివేశారు. అందుకోసం లాకుల వద్ద రాళ్లను పాతారు. దీంతో రైతులు తమ పంటపొలాల్లోని ఉత్పత్తులను గృహాలకు తీసుకెళ్ళటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పిడపర్రు లాకు గురించి అనేక పర్యాయాలు సంబంధించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పిడపర్రు లాకును నూతనంగా నిర్మాణం చేపట్టాలని కొల్లిపర మండల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లాకు మీదుగా వాహనాలు వెళ్ళకుండా ఇరిగేషన్ అధికారులు పాతిన రాయి

పొన్నూరులో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా

- నిధుల వినియోగంలో వైసీపీ పాలకుల నిర్లక్ష్యం
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల
- రూ.1.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పొన్నూరు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆటోనగర్ వంటి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. బుధవారం పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో పలు వార్డులలో రూ1.10 కోట్ల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న రూ.1.10 కోట్ల పనులతో పాటు రాబోయే రోజులలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను ప్రజలకోసం వినియోగించకుండా కమీషన్‌ల కోసం నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అమృత్ -2 పథకంలో భాగంగా రూ.15 కోట్ల నిధులకు ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా అనుమతి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తాగునీటి కాంట్రాక్టు పనులలో అవినీతిని ప్రస్తుతం నిలవరించినట్లు చెప్పారు. పొన్నూరు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరస్తామన్నారు. ఆటోనగర్ ఏర్పాటుకు ఇప్పటికే కేంద్ర మంత్రి చంద్రశేఖర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. అలాగే పట్టణ వాసులు సేదతీరడానికి నగరవనం ఏర్పాటు చేయాలని అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిడుబ్రోలుకు సమీపంలోని 100 ఎకరాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమీపంలోని ఖాళీ భూమిలో పట్టణ వాసులు సేద తీరేలా నగర వనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉగాది నుంచి కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పీ-4 విధానాన్ని అమలు చేస్తుందన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించి పీ-4 విధానం ద్వారా పేదలు ఆర్థికాభివృద్ధి చెందేలా పాటుపడనున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘ పరిధిలోని మెప్మా విభాగంలో జరిగిన రుణాల అవకతవకలపై సమగ్ర విచారణ జరుగుతుందని చెప్పారు. 225 పొదుపు సంఘాల ద్వారా రూ 7 కోట్ల పీఎల్ఎఫ్ రుణాలను దుర్వినియోగం చేసినట్లు గుర్తించమన్నారు. ఈ రుణాల రికవరీకి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వైసీపీ పాలకులు తమ హయాంలో ప్రతి విభాగంలో అవినీతికి పాల్పడ్డారని ఆ అవినీతి అక్రమాలను వెలికి తీసి ప్రజల ముందు ఉంచనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, పొన్నూరు, నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, జాగర్లమూడి సుధీర్, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్‌లు

పొన్నూరు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1 నుంచి సదరన్ స్లాట్‌లు తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు బుధవారం తెలిపారు. దివ్యాంగుల పింఛన్ల పరిశీలనల కారణంగా జనవరి నుంచి సదరం స్లాట్‌లు ప్రభుత్వం నిలిపివేసినట్లు చెప్పారు. దివ్యాంగుల సంఘాల విజ్ఞప్తి మేరకు స్లాట్‌లు తిరిగి ప్రారంభించి అర్హులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈ స్లాట్ల ఎంపిక కోసం ఏరియా, జిల్లా, టీచింగ్ ఆసుపత్రులు, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏప్రిల్ 1 నుంచి ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగులకు సూచించారు.

లక్ష్మీనరసింహాచార్యులుకు ఆగమ ద్యుమణి బిరుదు



తిరుపతి రాష్ట్రీయ సాంస్కృతిక విద్యాపీఠం నుంచి పురస్కారం అందుకుంటున్న లక్ష్మీనరసింహాచార్యులు

తెనాలి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆగమశాస్త్ర కోవిదులు దీవి లక్ష్మీనరసింహాచార్యులు ఆగమ ద్యుమణి బిరుదు అందుకున్నారు. ఆయన ఆగమ శాస్త్ర పాండిత్యం, ఆధ్యాత్మిక, సామాజిక సేవలను గుర్తించిన తిరుపతి రాష్ట్రీయ సాంస్కృతిక విద్యాపీఠం ఈ బిరుదు మంగళవారం రాత్రి ప్రదానం చేసింది. ఆయన అందిస్తున్న సేవలను పలువురు వక్తలు, ఇస్రో శాస్త్రవేత్త ఎల్.రాఘవేంద్ర, డీన్ రజనీకాంత్, వైస్ చాన్సలర్ శ్రీరామమూర్తి, ప్రొఫెసర్ రంగనాథన్ తమ ప్రసంగాల్లో అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

60 మంది ప్రియదర్శిని విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థులు 60మందికి ఉద్యోగాలు లభించాయి. కళాశాల విద్యార్థులు బుధవారం చింతలపూడి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పాల్గొన్నారు. టీసీఎస్, బ్లూస్టార్, క్యూస్, జెన్‌ప్యాక్ కంపెనీలకు ఉద్యోగాలకు ఎంపికైనట్లు చింతల శ్రీనివాసరావు చెప్పారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, డీవీ సుబ్బారావు, సుధ పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అడిషినల్ సివిల్ జడ్జి షరీఫ్

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- అడిషినల్ సివిల్ జడ్జి షరీఫ్

కొల్లిపర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అడిషినల్ సివిల్ జడ్జి ఎస్‌కే షరీఫ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన న్యాయ విజ్ఞానసదస్సులో ఆయన ప్రసంగించారు. న్యాయ విజ్ఞాన సదస్సుకు ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. 18ఏళ్లలోపు వయస్సు గల పిల్లలపై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కోటేశ్వరరావు, న్యాయవాదులు బేతాళ ప్రభాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలు

తెనాలిరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతా మందిరంలో బుధవారం శ్రీతాళ్లపాక అన్నమాచార్య 522వ ఆరాధన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తనా బృందం సభ్యులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు శ్రోతలను అలరించాయి. తొలుత తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఎంపికచేసిన సప్తగిరి సంకీర్తనలు 120మంది గాయకులు పాల్గొని స్వామి కీర్తనలు ఆలపించారు. కొండెపు శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పంచాంగం రామానుజ స్వామి, కృత్తి వెంటి కమల, కొండపి వసుంధర, నందిరాజు, నాగప్రసన్న, ఆరెళ్ల కల్యాణి, డాక్టర్ పురుషోత్తమరావు, ఆంజనేయ శాస్త్రీ, టీవీఎస్ శాస్త్రీ, ఎల్ నరసింహారావు, శంకర్‌రాజు, సుబ్బారావు, పెద్దసంఖ్యలో గాయనీ గాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ముస్లింలకు వెల్ఫేర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

- వివేకా విద్యా సంస్థల చైర్మన్ వీరనారాయణ

తెనాలి, మారీసుపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పేద ముస్లింల కోసం డాక్టర్ జాఫర్ సాధిక్ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని వివేకా విద్యాసంస్థల చైర్మన్ రావిపాటి వీరనారాయణ అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని డీఎల్ కాంతారావు వేదికలో రంజాన్ పండుగ సందర్భంగా పేద విద్యార్థులకు డాక్టర్ జాఫర్‌సాదిక్ ముస్లీం మైనారిటీ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖలీల్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివేకా విద్యాసంస్థల చైర్మన్ రావిపాటి వీరనారాయణ పాల్గొని 24మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు, అనారోగ్యంతో బాధపడుతున్న 18మంది పేదలకు వైద్యఖర్చులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లిం మైనారిటీ ప్రజలకు వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ది కాకతీయ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, ముస్లిం నాయకులు అబ్దుల్‌రవూఫ్, షబ్బీర్ బాషా, కరిముల్లా ఖాన్, దావూద్, పి.రవి, గౌసియా బేగం, ఇనయతుల్లా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేసిన డాక్టర్ జాఫర్ సాదిక్ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఖలీల్, వివేకా విద్యాసంస్థల చైర్మన్ వీరనారాయణ, కాంతారావు

హుండీల ద్వారా రూ 12 లక్షల ఆదాయం

పొన్నూరుటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సహస్ర లింగేశ్వరస్వామి, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాలలో హుండీల లెక్కింపు ద్వారా రూ.12లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో జీవీ అమర్‌నాథ్ తెలిపారు. బుధవారం బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలను లెక్కించారు. మూడు నెలల కాలానికి రూ.12,04,179 ఆదాయం సమకూరింది. హుండీల లెక్కింపులో దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హుండీల నగదును లెక్కిస్తున్న సిబ్బంది

రూ.2 లక్షల ఆదాయం

పట్టణంలోని సాక్షి భావనారాయణ స్వామి వారి ఆలయంలో హుండీల లెక్కింపు ద్వారా రూ 2లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. రూ 2,09,523 ఆదాయం సమకూరింది. హుండీల లెక్కింపులో దేవదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై 50శాతం రాయితీ

- మునిసిపల్ కమిషనర్ శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, ఆర్‌వో రాంప్రసాద్ తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెండింగ్ ఉన్న ఆస్తిపన్నులు చెల్లించి వడ్డీలో రాయితీ పొందాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న వెల్లడించారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆర్‌వో రాంప్రసాద్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న పన్నుబకాయిలు చెల్లించేవారికి వడ్డీలో 50శాతం రాయితీ ఇస్తామన్నారు. ఇంతకముందే చెల్లించినవారికి కూడా వడ్డీ రాయితీలను తదుపరి చెల్లించే పన్నుల్లో సర్దుబాటు చేస్తామన్నారు. పన్ను చెల్లింపుల కోసం పట్టణంలో ప్రత్యేక కౌంటర్లను చెంచుపేట, శివాజీచౌక్, లక్ష్మీడీలక్స్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పురపాలక సంఘ పరిధిలోని సచివాలయంలో కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు. పన్ను బకాయిలను సకాలంలో చెల్లించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఆర్‌వో రాంప్రసాద్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలను పూర్తిగా తొలగించండి

డ్రెయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మారీసుపేటలోని 21వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురుగు కాలువలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను గమనించి వాటివలన కలిగే పర్యావరణ సమస్యలపై వార్డు ప్రజలకు అవగాహన కలిగించాలని శానిటేషన్ అధికారులు, సచివాలయ సెక్రటరీలను సూచించారు. తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 22, 24, 25వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు మూడు బుట్టల విధానాన్ని అనుసరించి ఇంటి వద్దనే పారిశుధ్య కార్మికులకు చెత్తను అందించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాల రైతు కుటుంబానికి పరిహారం అందజేస్తున్న డైరెక్టర్ రామారావు తదితరులు

పాల రైతు కుటుంబాలకు డీవీసీ అభయ భరోసా

పొన్నూరు టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ పరిధిలోని పాల రైతుల కుటుంబాలకు డీవీసీ అభయ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు తెలిపారు. మండలంలోని కసుకర్రు గ్రామంలో మృతిచెందిన పాడి రైతు కుటుంబానికి బుధవారం రూ.50వేల ఆర్థిక పరిహారాన్ని అందజేశారు. కసుకర్రు గ్రామానికి చెందిన జె.హనుమంతరావు అనే పాలరైతు ఇటీవల మృతిచెందగా ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ స్కీం ద్వారా ఆ రైతు కుటుంబానికి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రూ.50 వేల పరిహారాన్ని మంజూరు చేశారు. ఈ నగదు చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ వీరేంద్రకుమార్, సూపర్‌వైజర్ బాలకిషోర్, కోఆర్డినేటర్ ముప్పవరపు సుధీర్‌బాబు, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జక్కా రవీంద్రనాథ్, బాబు పాల్గొన్నారు.